నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మహబూబ్‌నగర్
శుక్రవారం | ఆగస్టు 23. 2024 | www.navatelangana.com

వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ



నవతెలంగాణ- జడ్చర్ల

వృద్ధులకు చీరలు, పండ్లు,విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య కూతురు విశ్వవాణి జన్మదినం సందర్భ ంగా పంపిణీ చేశారు. జడ్చర్ల పట్టణం హౌసింగ్ బోర్డ్ నందు ఉన్న వృద్ధ ఆశ్రమంలో వృదులకు చీరలు ,పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా రుద్రారం గ్రామంలో పాఠశాలలో , క్లాస్ విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్ పెన్నులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బాదేపల్లి రంజిత్ బాబు,రఘుపతిరెడ్డి, రాంమోహన్, ఇంతియాజ్ , శంకర్ నాయక్, నర్సిములు, పాల్గొన్నారు.

పగిలిన పైపు లైన్

- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ- హన్వాడ

మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామంలో తాగునీరు పైపులైను పగిలి లీకేజ్ కావడంతో నీరంతా వృధాగా పోతున్నదని గ్రామస్తులు అన్నారు. దీంతో నీరు వృధాగా పోవడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు రామ్ రెడ్డి గురువారం తెలిపారు. వారం రోజులుగా మెయిన్ పైప్ లైన్ ద్వారా నల్లా నల్ల కనెక్షన్ కోసం తవ్వారదన్నారు. పైప్ లైన్ పగిలిపోవడంతో నీ రు వృధాగా పోతున్నది. లీకేజై నీరు కలుస్తామవుతుందన్నారు. అదే నీరును గ్రామంలో ప్రజలు తాగడం వల్ల అనేక రోగాలు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి వెంటనే పైప్ లైన్ లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు డీసీసీబీ చైర్మెన్ ఎన్నిక

- నిజాం పాషా రాజీణామాతో ఖాళీ ఏర్పడిన చైర్మెన్ పదవి
- అనేక మంది పోటీ పడినా... చివరికి
- నేడు డీసీసీబీ చైర్మెన్‌గా ఎవరికి..

జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మెన్‌ను నేడు ఎన్నుకోనున్నారు.అనారోగ్య కారణాల రీత్య నిజాంపాషా రాజీనామా గత నెల 30 రాజీనామా చేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయనున్నారు.మొన్నటి వరకు ఉపాధ్యక్షుడిగా ఉన్న కోరమోని వెంకటయ్య అధ్యక్షుడిగా వ్యవహరించారు. పూర్తిస్థాయి నియామకం చేయాలన్న ఉద్దేశ్యంతోనే ఎన్నికల నిర్వహించనున్నారు.



నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో 15 మంది డైరెక్టర్లు ఈ ఎన్నికల్లో పాల్గొనాల్సింది. వీరిలో 3గురు కాంగ్రెస్‌కు చెందిన వారు కాగా మిగితా వారు బీఆర్ఎస్ మద్దతుతో గెలిచిన వారే ఉన్నారు. బీఆర్ఎస్‌కు పూర్తి స్థాయి మద్దతున్నా.. కాంగ్రెస్ బలపరిచిన నాయకుడే చైర్మెన్ అయ్యే అవకాశాలున్నాయని అంచనా. డైరెక్టర్లు తగినంత లేకున్నా... అధికార పార్టీ బలపరిచిన వారినే గెలిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పలుమారు వివిధ పార్టీల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి జూపల్లి అనుచరుడు. ఆయన గెలుపు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. అందుకే జూపల్లి బలపరిచి చైర్మెన్‌గా విష్ణువర్ధన్‌రెడ్డిని గెలిపిం చడానికి ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు.గతంలో డీ సీ సీ బీ వెంటనే చైర్మెన్‌గా గతంలో కోరమోని వెంకటయ్య, జూపల్లి కృష్ణారావు, జక్క రఘు నందన్‌రెడ్డి నిజాంపాషా పోటీ పడితే అనేక బుజ్జగింపుల అనంతరం నిజాంపాషాకు అవకాశం దక్కింది.నిజాం పాషా రాజీణామా తర్వాత కోరమోని వెంకటయ్య, మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మంజులారెడ్డి అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అవసరమైతే పార్టీ మారేందుకు సైతం సిద్ధపడిన కోరమోని వెంకటయ్య చైర్మెన్‌గా అవకాశం కోసం హైదరాబాద్ కేంద్రంగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఫలితాలు పునరావృతం కారాదని శాసన సభ ఎన్నికలు జరిగిన తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు సంపూర్ణ బలమున్నా... కాంగ్రెస్ అభ్యర్థిని నిలబెట్టింది.అధికార పార్టీ అభ్యర్థి గెలుస్తాడని అందరూ.. ఊహించారు. అయితే ఊహించని రీతిలో బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి గెలిచారు. డీసీసీబీ ఎన్నికలో సైతం ఎమ్మెల్సీ ఫలితాలు పునరావృతం అవతాయా లేక అధికార అభ్యర్థి గెలుస్తాడా అన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే మామిళ్ల పల్లి విష్ణువర్ధన్‌రెడ్డి చైర్మెన్‌గా డైరెక్టర్‌లతో మాట్లాడినట్లు తెలుస్తోంది. అయితే ఇతనికి అధికార పార్టీ అండదండలు సైతం పుష్కలంగా ఉన్నట్లు సమాచారం. జూపల్లి కృష్ణారావు విష్ణువర్ధన్‌రెడ్డి గెలుపు ద్వారా తన మార్కు చూయించు కోవాలని తహతహ లాడుతున్నాట్లు సమాచారం.

నేడు జరిగే డీసీసీబీ ఎన్నికల షెడ్యూల్

నేడు జరిగే డీసీసీబీ ఎన్నికల షెడ్యూల్ ఇలా ఉంది.23న ఉదయం 9 నుండి 11గంటల వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగు తుంది.11.30 పరిశీలన ఉంటుంది. ఆతర్వాత 12 నుంచి 2గంటల వరకు నామినేషన్ల ఉప సంహరణ ఉంటుంది. 2.30 కి అభ ర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. 3నుంచి 5 గంటల వరకు పోలింగ్ ఆతర్వాత వెను వెంటనే ఫలితాల వెల్లడిస్తారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకును కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ- హన్వాడ

మండలంలో రైతు వేదికలో ఏర్పాటుచేసిన రుణమాఫీ ప్రత్యేక కౌంటర్లను జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రుణమాఫీ కానీ రైతుల నుండి వ్యవసాయ అధికారులు దరఖాస్తులు ఎలా తీసుకుంటున్నారని ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు రైతుల రుణమాఫీ కి సంబంధించిన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకూడదని అన్నారు. మండల కేంద్రంలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకును సందర్శించారు. రైతులకు రుణాలు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని బ్యాంక్ అధికారులతో చర్చించారు. రైతులకు ఏ విధంగా సకాలంలో రుణాలు అందుతున్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏడిప వెంకటేశ్వర్లు, ఏవో కిరణ్ కుమార్ ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- విశ్రాంత ఉద్యోగుల అధ్యక్షులు కే రామచంద్రయ్య

నవతెలంగాణ-హన్వాడ

జిల్లాలో మండలాల్లో ఉద్యోగులు విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆ సంఘం అధ్యక్షులు కే రామచంద్రయ్య కార్యదర్శి కొండా వెంకటయ్య కోశాధికారి వీ నారాయణ రిటైర్డ్ డీఎల్పీఓ అన్నారు. గురువారం మండల కేంద్రంలో పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు.. ప్రభుత్వం చేపట్టిన పథకాలలో పచ్చదనం-స్వచ్ఛతనం కార్యక్రమంలో వాలంటీర్లుగా సంబంధిత అధికారులకు సహకరించేందుకు ముందుంటామన్నారు. ప్రభుత్వ ,ప్రైవేటు వైద్యాధికారుల సహకారంతో మెడికల్ క్యాంపులు నిర్వహించి విశ్రాంతి ప్రభుత్వ ఉద్యోగుల వయోవృద్ధుల ఆరోగ్య సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. గ్రామాలలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా శిక్షణ శిబిరంలో ఏర్పాటు చేసి ఆరోగ్యం పట్ల చైతన్యపరిచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ మేనేజర్ గణపతి నాయక్,రిటైర్డ్ టీచర్ రాంరెడ్డి ,రిటైర్డ్ ఎస్సై కొత్తూరు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బైకు, లారీ ఢీ : తల్లి కూతురు మృతి

నవతెలంగాణ- జడ్చర్ల

లారీ ఢీకొని తల్లి కూతురు మృతి జడ్చర్ల మండలం లింగం పేట గ్రామానికి చెందిన రేఖ (23). తన కూతురు సాత్విక నాలుగు సంవత్సరాల అమ్మాయితో కలిసి తన తల్లిగారు ఊరైనా నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం ఎదిరేపల్లి గ్రామానికి రాఖీ పౌర్ణమి కి వెళ్ళారు. తిరిగి లింగంపేట గ్రామానికి బోనాల పండుగకు రావాలని భర్త రేఖను కోరాడు. దీంతో తన చెల్లెలు భర్త ఆంజనేయులు తో కలిసి బైకుపై ఎదిరేపల్లి నుం,ఇ లింగంపేట గ్రామానికి బయలుదేరింది. ఈ క్రమంలో గంగాపూర్ కోడుగల్ రహదారి మధ్యలో ఫర్టిలైజర్ లోడ్ తో వెళుతున్న లారీని ఓవర్టేక్ చేసే క్రమంలో బైక్ అదుపుతప్పి లారీ కింద పడ్డారు. లారి టైర్లు వారి తలలపై నుంచి వెళ్లాయి.దీంతో వారు అక్కడే చనిపోయారు. ఆంజనేయులు కు స్వల్ప గాయాలతో బయట పడ్డాడు .విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటన స్థలం వద్దకు చేరుకొని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామస్తులు కుటుంబ సభ్యులు రోడ్డుపై ముళ్ళ కంప వేసి పూర్తిగా రాకపోకలను అడ్డుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ ను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ అనంద్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాద తీరును పరిశీలించారు.

నూతన గృహప్రవేశ వేడుకల్లో 'యువనేత అభిమన్యు రెడ్డి'

నవతెలంగాణ -రాజాపూర్



రాజాపూర్ మండలకేంద్రంలోని మోత్కులకుంట తండా గ్రామ పంచాయతీలోని ధర్మనాయక్ తండాలో కేతవత్ హాథిరామ్ నాయక్ నూతన గృహప్రవేశ వేడుకల్లో బీఆర్ ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి హజరైయ్యారు. కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ హన్మగాళ్ల నర్సింహులు. బీఆర్ఎస్ నాయకులు,యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లమున్సిపల్ కమిషనర్‌రాజయ్య పై దానకిషోర్‌కు సీఐటీయూ ఫిర్యాదు

నవతెలంగాణ- జడ్చర్ల



జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ రాజయ్య పై పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్ కు ఫిర్యాదు గురువారం హైదరాబాద్ సచివాలయంలోని మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్‌కి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్,రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్ మహబూబ్‌నగర్ జిల్లా సీఐటీయూ కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, మున్సిపల్ యూనియన్ మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు ఆకుల వెంకటేష్ ,జడ్చర్ల మున్సిపల్ యూనియన్ నాయకులు మహేష్, కేశవులు, కృష్ణ గురువారం రోజు సచివాలయంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కరించ కుండా కమిషనర్ రాజయ్య కార్మికుల పట్ల నిరంకుశంగా, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడ తెలిపారు. అతనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రెండు బైకులు ఢీ... తీవ్ర గాయాలు

రాజాపూర్ : రెండు బైకులు ఢీ... తీవ్ర గాయాలై ఘటన రాజాపూర్ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజాపూర్ మండల కేంద్రంలో నేటి ఉదయం రెండు బైకులు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి.తీవ్రంగా గాయపడ్డాయి. వ్యక్తి రాజాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్యగా తెలిసిందన్నారు. వేగ నియంత్రికలు లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందన్నారు. రాజాపూర్ ముఖ్య కూడలిలో వాహనాల వేగాన్ని తగ్గించేందుకు నియంత్రికలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు పోలీసులను కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

నవ తెలంగాణ మహమ్మదాబాద్

అక్రమంగా పొలంలోకి ప్రవేశించి వరి నాటు ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మహమ్మదాబాద్ పోలీస్ స్టేషన్లో చోటు చేసుకున్నది.ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.మండలంలోని గాదిర్యాల్ గ్రామానికి చెందిన జమాల్పూర్ నాగరాజు పొలంలో వరి నాటు చేసుకున్నాడు.అదే గ్రామానికి చెందిన రామచందర్ అనే వ్యక్తి పొలంలోకి అక్రమంగా ప్రవేశించి వరి నారు ధ్వంసం చేశాడని ఫిర్యాదుదారుని మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

పెండింగ్ ధరణి దరఖాస్తులన్నింటిని తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తహసిల్దార్లకు ఆదేశం
- వీడియో కాన్ఫరెన్స్ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

జిల్లాలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులు అన్నిటిని తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తహసీల్దార్లను ఆదేశించింది.ధరణి, ప్రజావాణి, కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ తదితర అంశాలపై గురు వారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధ్రువపత్రాలు,ఆధారాలు అవసరమైన కేసుల్లో తప్ప పెండింగ్ ఉన్న అన్ని ధరణి దరఖాస్తులను వెంట పరిష్కరించాలన్నారు.కొత్తగా వచ్చేవి తప్ప పాత కేసులు అన్నింటిని పరిష్కరించేందుకు తహసీల్దారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.అలాగే ప్రజావాణిలో భూ సంబంధిత సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు.

వచ్చేవారం నుంచి అసైన్ భూములు,భూదాన్ భూములు, ఆన్ సెటిల్మెంట్ ఇనాం భూములపై సమీక్షించడం జరుగుతుందని, వాటన్నింటికీ సంబంధించిన సమాచారాన్ని సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే నాలా, జాతీయ రహదారులు,ఇరిగేషన్ ప్రాజె క్టులకు సంబంధించిన భూముల సమస్యలపై సైతం సమీక్షించనున్నట్లు వెల్లడించారు.ప్రజావాణి దరఖాస్తులన్ని ంటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ కేసులు ఇసుక అక్రమ జరిమానా వంటి వాటిపై ఆమె సమీక్షించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, ఆర్డీవో ఈ.నవీన్, ఎల్‌డిఎం భాస్కర్ ,కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి శంకర్,కలెక్టర్ కార్యాలయ విభాగాల అధిపతులు, తహసీల్దారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించాలనే సంకల్పమే : ఎమ్మెల్యే

నవ తెలంగాణ- మహబూబ్ నగర్



పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించాలనే సంకల్పమే నేటి ఈ ఎప్సెట్ మరియు నీట్ శిక్షణా తరగతులు ఏర్పాటు చేశామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల, మరియు యంవిఎస్ జూనియర్ కళాశాల లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు ఉచితంగా మెడికల్, ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ పరీక్షలకు శిక్షణ తరగతులను అందించాలనే లక్ష్యంతో తన సొంత నిధులతో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి బాలుర జూనియర్ కళాశాల ,బాలికల జూనియర్ కళాశాలలో ఉచితంగా 200 మంది విద్యార్థులకు (బాలురు 100, బాలికలు 100) అందించే శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎప్పుడూ చిన్నగా ఆలోచన చేయకూడదని, చిన్నగా ఆలోచన చేయడం ఒక పెద్ద నేరమని, కృషి పట్టుదల, ఆత్మస్థైర్యం ఉండాలన్నారు.మీరందరూ రానున్న రోజుల్లో రోల్ మోడల్‌గా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.సక్సెస్ ఒక్క రోజులో సాధ్యం కాదని,ఎంతో ప్రణాళికాబద్ధంగా సాగితేనే అది సాధ్యమవుతుందన్నారు. తరువాత శిక్షణా తరగతులు నిర్వహించే తరగతి గదులను కలెక్టర్ గారితో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, డీఐఈఓ ఉమామహేష్, ప్రిన్సిపాల్ భగవంతాచారి, కౌసర్ జహాన్, భీంరెడ్డి, రిషి జూనియర్ కళాశాల డైరెక్టర్ వెంకటయ్య,ప్రతిభ జూనియర్‌కళాశాల డైరెక్టర్ వెంకట్రామయ్య, రాజేందర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

షరతులు లేకుండా రైతుల రుణాలు మాఫీ చెయాలి : మాజీ మంత్రి



మహబూబ్‌నగర్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ చౌరస్తాలో జరిగిన రైతు ధర్నాలు వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకి సకాలంలో రుణమాఫీ, రైతు బంధు, విత్తనాలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇచ్చామని తెలిపారు. ఈధర్నా లో గ్రంధా లయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ రెహమాన్, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, హన్వాడ మాజీ ఎంపీపీ బాలరాజు, రైతు సమితి అధ్యక్షులు గోపాల్ యాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షులు శివరాజ్, మహబూబ్ నగర్ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, హన్వాడ పార్టీ అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, కౌన్సిలర్ లు తాటి గణేష్, అనంత రెడ్డి, పటేల్ ప్రవీణ్, సీనియర్ నాయకులు గిరిధర్ రెడ్డి, లక్ష్మయ్య , నవకాంత్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట స్వామి, ప్రభాకర్, ఇమ్రాన్, సుధాకర్, అన్వార్,చెన్నయ్య పాల్గొన్నారు.

మిడ్జిల్ :బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతుల అందరికీ రుణమాఫీ చేయాలని మాజీ ఎంపీపీ బరిగెల సుదర్శన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పాండు యాదవ్, మాజీ రైతుసమన్వయ సమితి అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ లు అన్నారు.మిడ్జిల్ మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో జడ్చర్ల కల్వకుర్తి ప్రధాన రహదారిపై రాస్తారోకో ధర్నా నిర్వహించారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుకుమార్,జగన్‌గౌడ్,భాస్కర్‌చారి,గంజిశేఖర్,శ్రీనివాస్,నారాయణరెడ్డి,భాస్కర్‌నాయక్,మల్లయ్య, బుచ్చయ్య,భద్రయ్య వరుణ్, బంగారు, భీమ్.రాజు, రాములు, రవీంద్ర, రాఘవేందర్,నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి : రైతు సంఘం



హన్వాడ :రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద నిధులు విడుదల చేసి రైతుల ఖాతాలో డబ్బు జమ చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఏ రాములు అన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఏ లక్ష్మయ్య ,నర్సింహులు ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నర్సింలు, లక్ష్మయ్యమండల నాయకులు తిరుమలగిరి రాములు, బాల్‌రెడ్డి, రవి, వెంకట రాములు, బాలయ్య వెంకటయ్య నర్సింలు టంకర రాములు పలువురు రైతులు పాల్గొన్నారు.

అమ్మ పేరు మీద మొక్క నాటుదాం

- జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి
- కస్తూర్బి గాంధీ బాలికల విద్యాలయం తనిఖీ
- మొక్కల వల్ల భవిష్యత్తులో వాతా వరణ సమతుల్యం



నవతెలంగాణ -హన్వాడ

స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ప్రతి గ్రామంలో నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బి గాంధీ బాలికల విద్యాలయంలో నాటుదాం ఒక మొక్క అమ్మ పేరు మీద కేజీబీవీ ఆవరణలో మొక్కలు నాటారు. ఇలాంటి కార్యక్రమాలు జిల్లా అంతట అన్ని గ్రామాలలో నిర్వహించాలన్నారు. మొక్కలు నాటడం వల్ల ఉన్న లాభాలను ప్రతి ఒక్కరికీ తెలియజేసి విరివిగా మొక్కలు నాటేలా చూడాలన్నారు. మొక్కల వల్ల భవిష్యత్తులో వాతావరణ సమతుల్యంతో పాటు వర్షం సమృద్ధిగా వస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కస్తూర్బి గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు ఇస్తున్న భోజనం ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని టాయిలెట్స్ మౌలిక సదుపాయాలన్నిటిపై చెక్ లిస్ట్ తయారుచేసి తక్షణం పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం భోజనం ఇవ్వాలని, నాణ్యత తగ్గకూడదన్నారు. పాఠశాలలో ఆరో ప్లాంట్ వాటర్ పైప్ లైన్ లీకేజీ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ నరసింహులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేష్ ,ఎంపీడీవో యశోదమ్మ,కేజీబీవీ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, వ్యవసాయ అధికారి ఏపీఎం, అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ

- అవాజ్ సంఘం రాష్ట్ర నాయకులు ఎండి జబ్బార్



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

చరిత్రను వక్రీకరించి యువతరాన్ని పక్కదోవ పట్టించేందుకు బీజేపీ కుట్రలు చేస్తోంది. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన నాయకులు సోయబుల్లాఖాన్ అని అవాజ్ సంఘం రాష్ట్ర నాయకులు ఎండి జబ్బార్ అన్నారు.మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో సోయబుల్లాఖాన్ 76 వర్ధంతి సందర్భంగా సోయబుల్లాఖాన్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ముంబాయిలో ఇంటర్ పూర్తి చేసిన తర్వాత సోయబుల్లాఖాన్ హైదరాబాద్‌లో జర్నలిజం చేసి సమాజంలో ఉన్న కుళ్లును కడిగి పారేయడానికి అనేక వ్యాసాలు రాశాడని గుర్తు చేశారు.పలు పత్రికలను నడుపుతూ.. నిజం నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తూ... ఆయన చేయని పోరాటాలు లేవన్నారు. ఆయన నడిపిన ప్రతి పత్రికను నిషేదించినా.. ఆయన పత్రికారంగాన్ని వీడలేదన్నారు. నిజాం కాలం నాటి కాసీం రజ్వీ నియంతృత్వ విధానాలను వ్యాసాల రూపంలో తెచ్చేవడాని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 550 సంస్థానాలను భారత్‌లో విలీనం చేసి తెలంగాణను విలీనం చేయక పోవడాన్ని నిరసిస్తూ... ఆయన రాసిన వ్యాసాలు చరిత్ర పుటల్లో నిలిచాయన్నారు. ఒక సిరా చుక్క లక్ష మెదళ్ల కలయిక అన్న విదందా ఆయన సమాజాన్ని చైతన్యం చేసేవిధంగా పత్రిను కొనసాగించవారన్నారు. అదేవిధంగా సోయబుల్లాఖాన్ వాసాలను కాసీం రజ్వీ చంపేస్తామని హెచ్చరించినా..ఆయన వ్యాస రచన ఆపలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.రాములు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లె గోపాల్,ఆవాజ్ మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ ఖయ్యూమ్,నాయకులు బుర్రి భాస్కర్,సురేష్, దిలీప్, వంశీ, విజయ్, ప్రవీణ్, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని సఫాయి(మున్సిపల్)కార్మికుల నిరసన



జడ్చర్ల :సఫాయి(మునిసిపల్)కార్మికులకు రాజ్యాంగ హక్కులు వర్తింపచేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి,తెలుగు సత్తయ్య, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేష్, పట్టణ కమిటీ ఉపాధ్యక్షులు అంజమ్మ,కేశవులు ఆర్గనైజింగ్ సెక్రటరీ,కృష్ణ అన్నారు. గురువారం జడ్చర్ల మున్సిపల్ కార్మికులు శానిటేషన్ విధులు ముగించుకొని 11 గంటలకు డాక్టర్ అంబేద్కర్ కళాభవన్ వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 17 రోజులుగా తమ విధులను చేసుకుంటూ రోజు దశల వారి నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేస్తు హక్కుల కోసం పోరాడుతుంటే, కార్మికుల కార్మిక నాయకుల పైన కక్ష కట్టి అసత్యపు ఆరో పణలు కమి షనర్ చేస్తూన్నారని ఆరోపించారు. అంతేకా కుండా కమిషనర్ కార్మికులను భయభ్రాం తులకు గురి చేయు టకు పూనుకున్నారన్నారు. కార్మికుల కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ అనే పేరుతో హక్కులే వర్తించవు, రాజ్యాంగ హక్కులు లేవు అనే విధంగా మాట్లాడడం విడ్డురంగా ఉందన్నారు. కార్యక్ర మంలో, మున్సిపల్ యూనియన్ కార్యవర్గ సభ్యులు దేవమ్మ,ఎస్‌యాదయ్య,మహేష్,స్వరూప,భీమమ్మ మొగులమ్మ,,లక్ష్మి, జంగమ్మ బెల్లంజయమ్మ, వినోదు తదితర కార్మికులు పాల్గొన్నారు.

జానపద కళలను పరిరక్షించుకుందాం

-రిటైర్డ్ ప్రొఫెసర్ జానపద కళ రత్న,జానపద నృత్య చక్రవర్తి బిరుదు గ్రహీత చిగిచర్ల కృష్ణారెడ్డి



నవతెలంగాణ -మహమ్మదాబాద్



జానపద కళలను పరిరక్షించుకుందామని రిటైర్డ్ ప్రొఫెసర్ జానపద కళ రత్న,జానపద నృత్య చక్రవర్తి బిరుదు గ్రహీత చిగిచర్ల కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నంచర్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాంశాలలో జానపద సంగీత ఉపాధ్యాయిని శ్యామల ఆధ్వర్యంలో...జానపద కళ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు డప్పులు, కోలాటం, నృత్యకళ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.జానపద సాహిత్యం జానపద విజ్ఞానం,మాట నుంచి పాట ఉద్భవిస్తే పాటకు సంగీతం జాత కలిసి కళగా రూపాంతరం చెందుతుందని తెలిపారు.ఈకార్యక్రమంలో కవయిత్రి డాక్టర్ మాడ పుష్పలత, తెలంగాణ ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి ఎస్ సంతోష్,ప్రిన్సిపాల్ అరుణ, ఉపాధ్యాయ బృందం శ్రీదేవి,వాసవి, హరిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



నవతెలంగాణ-వీపనగండ్ల

నాటిన మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని కల్వరాల గ్రామంలో రైతు వేదిక దగ్గర మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కల్వరాల నరసింహ, ఏపీఓ శేఖర్ గౌడ్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాన్ని కనుగుణంగా గ్రామంలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కలను ఎండిపోకుండా సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కురుమన్న, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, ఫీల్డ్‌అసిస్టెంట్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది, యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో తీరనున్న విద్యుత్ సమస్యలు

నవతెలంగాణ- వనపర్తి

ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవతో గ్రామీణ ప్రాంతాల్లో లో వోల్టేజీ సమస్య తీరనుంది. 20 రోజుల క్రితం నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ సమస్యలపై జిల్లా విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించి పరిష్కారానికి కావలసిన ఉప కేంద్రాలు , విద్యుత్ లైన్ ఏర్పాటు తదితర వాటి గురించి అధికారుల నుంచి సేకరించారు. అనంతరం ఆయన ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ భట్టి విక్రమార్కతో ప్రత్యేకంగా సమావేశమై వివరించారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన వనపర్తి మండలం మెంటపల్లి, కాశీంనగర్, నాగవరం, రాజనగరం, గోపాల్‌పేట మండలం తాడిపర్తి, పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి, శ్రీరంగాపురం మండలం నగరాల గ్రామాల్లో 33/11 కేవీ ఉప కేంద్రాలను మంజూరు చేస్తు నిర్మాణాలకు కావాల్సిన చర్యలు వెంటనే తీసుకోవాలని సం బంధిత శాఖ అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే గురువారం తెలిపారు. విద్యుత్ కేంద్రాల మంజూరుకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సురభి

నవతెలంగాణ-వనపర్తి

ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అక్రమ లే-అవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరిం చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి జిల్లా స్థాయి లే అవుట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో టిజిబిపాస్ ద్వారా డిటిసిపి లేఅవుట్ లతో పాటు జిల్లాలో 2014 నుండి అక్రమ లే అవుట్లు, ఎల్ ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు వాటి క్రమబద్ధీకరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడు అక్రమ లే-అవుట్‌లు, ప్లాట్ల ఎల్ఆర్ఎస్ కోసం మొత్తం వచ్చిన దరఖాస్తులను చిన్న చిన్న క్లస్టర్‌లుగా విభజించుకొని ఎల్‌టిపిసిలు, డెవలపర్‌లు, బిల్డర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అక్రమ లే-అవుట్లు, ప్లాట్లు ఎక్కడెక్కడ ఉన్నయో మ్యాపింగ్ చేసుకొని రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖ సిబ్బందితో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీ లించాలన్నారు. శిఖం భూమి, ప్రభుత్వ భూమి, గ్రామ కంఠం, హై టెన్షన్ వైర్లు, ఇరిగేషన్ కాలువ పక్కన, భూసేకరణ చేసిన భూమి వంటివి ఉంటే తిరస్కరించాల న్నారు. అలాంటివి లేని పక్షంలో క్రమబద్ధీకరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని అయిదు మున్సిపాలిటీల్లో కలిపి దాదాపు 45 వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని క్రమబద్ధీకరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. డిటిసిపి లే-అవుట్ గురించి వివరిస్తూ డ్రాఫ్ట్ లే అవుట్ ఆన్లైన్ ద్వారా దరఖాస్తు వచ్చిన 30 రోజుల్లో తుది లే-అవుట్ ఆమోదించాలని ఇందుకు టెక్నికల్ ఆఫీసర్, సైట్ ఇన్స్పెక్షన్ ఆఫీసర్లు తమ లాగిన్‌లో వచ్చిన వాటిని పరిశీలించి జిల్లా కమిటీకి పంపించాలని సూచించారు. ఆర్డీవో, పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ, ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి తమ నివేదికలను సకాలంలో ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ డీఈ సీతారామస్వామి, మున్సిపల్ కమిషనర్లు, టిపిఒలు, డిటిలు తదితరులు పాల్గొన్నారు.

24న ఆర్ఓఆర్ బిల్లుపై అవగాహన సదస్సు

ప్రభుత్వం ధరణి స్థానంలో తెచ్చిన నూతన ఆర్ఓఆర్ బిల్లు 2024 పై వనపర్తి జిల్లాలో రెవెన్యూ రిటైర్డు ఉద్యోగులు, న్యాయవాదులు, రైతు సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, బోధనా సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు తదితర నిపుణులతో ఈ నెల 24న ఉదయం 11 గంటల నుండి ఐడిఓసి సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిలా కలెక్టర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు పైన పేర్కొన్న వారితో పాటు మీడియా ప్రతినిధులు హాజరై ఆర్ఓఆర్ 2024 బిల్లుపై అను మానాలు నివృత్తి చేసుకోవడమే కాకుండా, సలహాలు, సూచనలు ఇవ్వా లని పేర్కొన్నారు.

గడువు వరకు బాధ్యతలు తీసుకోవాలి

నిర్దేశించిన గడువు వరకు సీసీ రోడ్డు నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని కలెక్టర్ కాంట్రాక్టర్లకు సూచించారు. గురువారం ఆయన అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తో కలిసి వనపర్తి పట్టణంలోని 22వ వార్డు, సాయికృష్ణ కాలని నుండి తాళ్ల చెరువు గుండా వేసిన సీసీ రోడ్లు, తాళ్ళ చెరువు పచ్చదనం అభివృద్ధి కొరకు రూ.104 లక్షల వ్యయంతో పనులు చేపట్టగా ఫైనల్ బిల్లు నిమిత్తం కలక్టర్ స్వయంగా పనుల నాణ్యతను పరిశీలించారు. తాళ్ళ చెరువు కట్ట ఇరువైపులా కొన్ని చెట్లు చనిపోయాయని, పోయిన వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. 2025 వరకు నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అక్రమ లే అవుట్లను పరిశీలించారు. వచ్చే వినాయక నిమజ్జనానికి నల్ల చెరువు దగ్గర ఉన్న పరిస్థితులు, చేపట్టాల్సిన సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు.

జ్వర పీడితులకు రక్త పరీక్షలు



రక్తం నమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

నవతెలంగాణ-పెబ్బేరు

పెబ్బేరు పురపాలక కేంద్రం రెండో వార్డులో జ్వర పీడితులను గుర్తించి వారికి రక్త పరీక్షలు చేయించినట్లు వార్డు కౌన్సిలర్ అక్కమ్మ తెలిపారు. వార్డు పరిధిలో విష జ్వరాలు ప్రభలుతుండడంతో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది ఆశ వర్కర్లు జ్వరంతో బాధపడుతున్నవారి నుంచి రక్తం నమూనాలు సేకరించారు. రిపోర్టు వచ్చిన తర్వాత ఎవరెవరికి ఏ సమస్య ఉందో తెలుసుకొని మందులు అందజేయాలని వైద్యాధికారులకు సూచించినట్లు అక్కమ్మ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ విస్తరణాధికారికి సన్మానం



వ్యవసాయాధికారులను సన్మానిస్తున్న రైతులు

నవతెలంగాణ- పెబ్బేరు

పెబ్బేరు మండలంలోని వైశాఖపూర్, తోమాలపల్లి గ్రామాల విస్తరణ అధికారి ఆంజనేయులను వైశాఖాపూర్ గ్రామ రైతులు గురువారం సన్మానించారు. ఆంజనేయులు ఆయా గ్రామాల విస్తరణ అధికారిగా 8 సంవత్సరాలు పని చేసి ఇటీవల సుగూర్ గ్రామానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కోట్ల బాలచంద్రారెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

నవతెలంగాణ- ఆత్మకూర్

ఆత్మకూరు మండల పరిధిలోని లోయర్ జూరాల ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నట్లు ప్రాజెక్టు ఆపరేషన్, మెయింటెనెన్స్ ఇంజనీర్ రామ సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం ఆరు యూనిట్లలో 70.812 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా జూరాలలో ఐదు యూనిట్లలో 94.563 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయినట్లు జూరాల ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

లింక్ కెనాల్ భూ నిర్వాసితులకు

ఎకరాకు రూ.25 లక్షలు చెల్లించాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్
- రైతులతో కలిసి భూసేకరణ కలక్టర్‌కు వినతి

నవతెలంగాణ- వీపనగండ్ల

సింగోటం, గోపాల్ దిన్నె లింకు కెనాల్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు 25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జబ్బర్ అన్నారు. గురువారం మండలంలోని బొల్లారం సీపీఎం గ్రామ కమిటీ సభ్యులు, రైతులతో కలిసి ఆయన వనపర్తిలో భూసేకరణ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగోటం రిజర్వాయర్ నుంచి గోపాల్‌దిన్నె రిజర్వాయర్‌కు లింకు కెనాల్ ద్వారా రైతులకు సాగునీరు అందించేందుకు చేపడుతున్న పనుల్లో భూములు కోల్పోతున్న రైతు లకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నాలుగింతలు కలిపి పరిహారం ఇవ్వాలన్నారు. మల్లన్న సాగర్, ఇతర ప్రాజెక్టుల్లో భూములు పోయిన రైతులకు ఎకరాకు రూ.20 నుంచి 25 లక్షలు నష్టపరిహారం చెల్లించిందని అదే విధంగా ఈ ప్రాంత రైతులకు కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో భీమా, కేఎల్ఐ ఇతర కాలువల్లో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ముందుగానే సంతకాలు తీసుకొని పరిహారం తక్కువ ఇచ్చిందన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుతం అలా కాకుండా ప్రభుత్వం ముందుగానే నష్టపరిహారం చెల్లించి రైతులతో సంతకాలు చేయించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సరైన నష్టపరిహారం చెల్లించకుంటే రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎం కృష్ణయ్య, మండల నాయకులు వి.కృష్ణయ్య, కురుమయ్య, శ్రీనివాసులు, వెంకటయ్య, బాలపీరు, కృష్ణయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

వనపర్తి : ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణమాఫీ అంశంపై తల త్తిన అంశాలపై గురువారం కలెక్టర్ ఆదర్శ్ సురభికి సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు మంజూరు చేసే టప్పుడులేని నిబంధనలు రుణమాఫీ చేయడానికి విధించడం వల్ల 60 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు అప్పు ఉన్న ప్రతి రైతుకు మాఫీ చేయాలన్నారు. రేషన్ కార్డు నిబంధనలు తొలగించి, పహాణీ నకల్ మీద రుణం తీసుకున్న ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలన్నారు. వనపర్తి జిల్లాలో మూడు లక్షల డెబ్బై ఒక వేల మంది రైతులు అర్హులు జాబితాలో ఉండగా మూడు విడతల్లో కలిపి కేవలం 1 లక్ష 15 వేల మందికి మాఫీ జరిగిందన్నారు. మిగితా రెండు లక్షల ఏభై ఆరు వేల మంది రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయాలు, రైతు వేదికలు, బ్యాంకులు చుట్టూ తిరుగుతున్నార న్నారు. రాష్ట్ర ప్రభుత్వం, మంత్రులు రోజు కో ప్రకటన చే స్తూ రైతులను మరింత గందరగోళానికి గురి చేస్తున్నాం"న్నారు. వ్యవసాయ శాఖ సాంకేతిక సమస్యలను పరిష్కరించి ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం. కృష్ణయ్య, నాయకులు వీ.కృష్ణయ్య, కురుమయ్య శ్రీని వాసులు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు సడలించాలి

మదనాపురం: రైతు రుణమాఫీకి ప్రభుత్వం విధించిన 31 నిబంధనలను సడలించాలని, రెండు లక్షలను వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొత్తకోట మండల కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 74 లక్షల మంది రైతులు ఉండగా అందులో 42 లక్ష ల రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని ఇంకా 32 లక్షలు రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. జిల్లాలో వీపన గండ్ల మండలంలో 4,000 మంది రైతులు తీసుకోగా అందులో ప్రభుత్వం 2000 మందికి, పాన్‌గల్ మండలంలో 3,000 మంది రైతులు ఉండగా 1300 మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. వీటిని చూస్తే జిల్లాలో ఎక్కడా కూడా పూర్తి స్థాయిలో రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఇప్పటికే రైతులు రుణమాఫీ కొరకు బ్యాంకుల చుట్టూ, సొసైటీల చుట్టూ తిరుగుతూ చాలామంది రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయంలో ధరణిలో ఫోర్జరీ జరిగిందని వాటిని మార్చేందుకు భూమాత పేరు మీద రికార్డులు మార్చేస్తామని ఆ సమస్య కూడా పెండింగ్లో ఉందని నాడు కాంగ్రెస్ ప్రగల్భాలు పలకి నేడు అవన్నా మరవడం సిగ్గుచేటన్నారు. వెంటనే రైతులకు కొత్త రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బాల్ రెడ్డి, మండల కార్యదర్శి బొబ్బిలి నిక్సన్, నాయకులు నెల్లూరి కురుమన్న, బాలస్వామి, కురుమన్న, యాదయ్య, రాములు, వెంకటేష్, నాగేంద్రం, రాజు, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.



భూసేకరణ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జబ్బార్

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి
- ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకుల ధర్నా



రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

నవతెలంగాణ-వనపర్తి

ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రూ. 2లక్షల రుణమాఫీఅమలు చేయాలని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు గురువారం బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి నపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిరంజన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణ మాఫీ లభించిందన్నారు. ముఖ్యమంత్రి రుణమాఫీ పూర్తయ్యిందని చెబుతుంటే మంత్రులు తలా ఓ మాట చెబుతూ రైతులను అయోమయానికి గురి చేస్తు న్నారని విమర్శించారు. అనేక ఆక్షంలు పెట్టి రైతులను మోసం చేసిన ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్యాంకుల్లో అప్పు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలడిమాండ్ చేశారు. రుణమాఫీ కోసం 40 వేల కోట్లు అవసరం అవుతాయని స్వయంగా చెప్పిన సీఎం 31 వేల కోట్లకు మాత్రమే అనుమతి ఇవ్వడం సరైనది కాదన్నారు. బడ్జెట్లో 26 వేల కోట్లకు మాత్రమే ఆమోదం తెలిపి రైతులను మోసం చేసే కార్యక్రమం చేపట్టిందని దుయ్యబట్టారు. అందులోనూ 18 వేల కోట్ల రూపాయలనే ఖర్చు చేసిందన్నారు. ప్రభుత్వ వైఖరి కారణంగా లక్షల మంది రైతులు నిత్యం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా రెండు లక్షల లోపు రుణాలున్న రైతులందరికీ రుణమాఫీ చేప టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలాగే రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు 7500 చొప్పున యాసంగి, వానాకాలం పంటలకు రూ.15, 000లు చెల్లించాలన్నారు. చనిపోయిన రైతులకు వెంటనే రైతు బీమా మంజూరు చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, మాణిక్యం, నిరంజన్, రమేష్‌గౌడ్, ఆశోక్, ధర్మానాయక్, గులాం ఖాదర్, బుచ్చన్నాయక్, ఎర్రశ్రీను, కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరులో..

పెబ్బేరు : ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దిలీప్ కుమార్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయి, వైస్‌చైర్మన్‌తో కలిసి మాట్లాడుతూ ఎన్నికల ముందు రెండు లక్షల రుణమాఫీని తక్షణమే చేస్తామంటూ రైతులకు హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక రేవంత్ సర్కార్ మాట మార్చిందన్నారు. అనేక నిబంధనలు పెట్టి రైతులకు రుణమాఫీ అరకొరగా చేస్తుందని విమర్శించారు. ఇప్పటికీ అనేక మంది రైతులకు రుణమాఫీ కాలేదని, ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రెండు లక్షల రుణ మాఫీని చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ లక్ష్మీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, కొన్నెర్లు, బీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డి గోవింద్ నాయుడు, విశ్వరూపం, మధు, వీర స్వామి నాయుడు, వేణు, వెంకటన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగాపురంలో..

శ్రీరంగాపురం మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం తాహశీల్దార్ కార్యా లయం ఎదుట పార్టీ నాయకులు రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసపూరిత కుట్రలను రైతులు గమనించాలన్నారు. రైతులందరికీ ఆంక్షలు లేకుండా తక్షణమే రుణమాఫీ రెండు లక్షలు చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకోవాలన్నారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ రైతుల పక్షాన ఉద్యమాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ ధర్నాలో మండలంలోని అన్ని గ్రామాల పట్టణ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్లు, రైతు సమితి మండల కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల రైతు రైతుబంధు కమిటీ అధ్యక్షులు సభ్యులు, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



పెబ్బేరులో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



శ్రీరంగాపూర్‌లో వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిందితుడికి జైలు శిక్ష

నవతెలంగాణ-వనపర్తి రూరల్

గోపాల్‌పేట మండల ప్రజా పరిషత్ పాఠశాలలో కలర్ టీవీ, ట్యాబ్ చోరీ చేసిన ఘటనలో నింధితుడికి గురువారం రెండవ అడిషనల్ జడ్జి జానకి జైలు శిక్షా, జరిమానా విధించినట్లు ఎస్సై హరిప్రసాద తెలిపారు. ఆయన వివరాల మేరకు మండల ప్రజా పరిషత్ పాఠశాలలో కలర్ టీవీ, ట్యాబ్ చోరీ అయినట్లు ప్రధానోపాధ్యాయుడు గత జనవరి 23న పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్టి ఎస్సై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. మార్చి17న ఏదుట్ల క్రాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా జనార్ధన్ అనే వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకుని విచారించగా పాఠవాలతో పాటు అదే గ్రామంలో కిరాణా షాప్ వద్ద నిలిపి ఉన్న బైకును అపహరించినట్లు ఒప్పుకొవడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుచగా నేరం రుజువు కావడంతో అడిషనల్ జడ్జి జానకి నింధితుడికి 9 నెలల జైలు శిక్షతో పాటు 200 రూపాయల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

నవతెలంగాణ -ఆత్మకూరు

ఆత్మకూరు మండల పరిధిలోని తిపుడంపల్లి గ్రామానికి చెందిన సువర్ణ (35) పాముకాటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తిప్పడంపల్లి గ్రామస్తుల వివరాల ప్రకారం సువర్ణ గురువారం తన గుడిసెను శుభ్రం చేసేందుకు సామాను బయటకు తీస్తుండగా కాలుకు ఏదో గుచుకునట్లు అనిపించినా , పట్టించుకోకుండా అలాగే పని చేసి కొద్దిసేపటికి కాలకృత్యాలు తీర్చు కునేందుకు వెళ్లగా అకస్మాత్తుగా పడిపోవడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సువర్ణ పాముకాటువల్లే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.మృతురాలు సువర్ణకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ పిల్లాడు ఉన్నట్లు తెలిపారు. భర్త కొంత కాలం నుంచి దూరం ఉండడంతో తల్లిదండ్రుల దగ్గరే ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు పోలీసులు తెలిపారు.

రైతులకు సంకెళ్లు వేసిన ఘనత బీఆర్ఎస్‌ది

- కాంగ్రెస్ నాయకుడు దేవన్న నాయుడు

నవతెలంగాణ-వనపర్తి

గతంలో గిట్టుబాటు ధర అడిగిన ఖమ్మజిల్లా మిర్చి రైతులకు సంకెళ్ల వేసి జైలుకు పంపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని, రైతు రుణమాఫీపై మాట్లాడే నైతిక హక్కు ఆపార్టీకి లేదని వనపర్తికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మండ్ల దేవన్న నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేపట్టిందన్నారు. 2023 జులైలో బ్యాంకర్లు లక్షల మంది రైతులను డిఫాల్టర్ జాబితాలో చేర్చిన ఘనత బీఆర్ఎంకే దక్కిందన్నారు. పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షమ పథకాలు అమలు చేస్తుంటే , కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు వస్తుదని, రైతులకు సంతోషంగా ఉండాన్ని తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులు రైతులను తప్పుదోవపట్టిస్తూ ధర్నాలు చేస్తున్నారని విమర్శించారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని వారికి త్వరలో రుణమాఫీ చేస్తారన్నారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ రైతుల బ్యాంక్ వడ్డీలకే సరిపోయిందని విమర్శించారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు ఒక తప్పుడు వాదనతో రైతుల్లో ఆందోళన కలుగజేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కందికోటి శీను, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ -వనపర్తి

వనపర్తి పట్టణంలో గాంధీనగర్ 19వ వార్డుకు చెందిన సోహెల్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయాన్ని గురువారం స్థానిక కౌన్సిలర్ చంద్రకళ, ఎల్‌ఐసి కృష్ణ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. అనారోగ్యంతో మరణించిన సోహెల్ కుటుంబానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కొనసాగుతున్న మేఘన్న అభయహస్తం కింద రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరక కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్ ద్వారా బాధిత కుటుంబానిక అందజేశారు. ఆయన వెంట టీపీసీసీ వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్యారపోగు వెంకటేష్, తిరుపతి నాయక్ గోపికృష్ణ, సాగర్‌లు సోహెల్ తదితరులు ఉన్నారు.

ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..



నవతెలంగాణ - వీపనగండ్ల

మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామానికి చెందిన ఎరుకల శీను అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఇంద్రకంటి వెంకటేష్ రూ.5వేల ఆర్థిక సాయం ప్రకటించగా గురువారం కాంగ్రెస్ నాయకుడు, దివ్యాంగుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మీసాల మోహన్, ఇంద్రకంటి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శేఖర్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందజేశారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు మీసాల కురుమయ్య, ఉడుత కురుమయ్య, ఎరుకలి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

బాల్య స్నేహితుడికి...



నవతెలంగాణ -మదనాపురం

మదనాపురం మండలంలోని అజ్జకోలు గ్రామానికి చెందిన బాలకృష్ణ చారి మాతృమూర్తి అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బాలకృష్ణచారి చిన్ననాటి స్నేహితులు గురువారం పరామర్శించి రూ.43వేలు అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణచారి స్నేహితులకు కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వంగూరు రామకృష్ణ రెడ్డి, కరగడ్ల మల్లేష్, ఎద్దుల లక్ష్మన్న, బాలయ్య బ్రహ్మయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
నాగర్‌కర్నూల్
శుక్రవారం ఆగస్టు 23, 2024 www.navatelangana.com

దివ్యాంగ విద్యార్థులు జాతీయ స్కాలర్షిప్ : కలెక్టర్

నవతెలంగాణ-కందనూలు

జిల్లాలోని అర్హులైన దివ్యాంగ విద్యార్థులు ఉన్నత విద్య కొరకు జాతీయ స్కాలర్షిప్ కోసం దరఖాస్తు సకాలంలో సమర్పించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా, శిశు దివ్యాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ క్రింద దివ్యాంగుల సాధికారత విభాగం ద్వారా జాతీయ స్కాలర్షిప్ పోర్టల్ నందు దివ్యాంగుల ఉన్నత విద్యకు మూడు రకాల స్కాలర్షిప్‌లు అందించడం జరుగుతుందని, 9, 10వ తరగతి విద్యార్థులకు ప్రీమెట్రిక్ స్కాలర్షిప్, ఇంటర్ నుంచి పీజీ వరకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్, గ్రాడ్యుయేషన్ / పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ లేదా డిప్లమా కోసం టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్షిప్ అందిస్తామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థినీ విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్షిప్ నూతన లేదా రెన్యువల్ : **www.scholorships.gov.in** చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. **www.depwd.gov.in** దివ్యాంగ విద్యార్థిని విద్యార్థులు తమ దరఖాస్తులు సమర్పించేందుకు ప్రీ మెట్రిక్స్ స్కాలర్షిప్ కోసం ఆగస్టు 31 వరకు, పోస్ట్ మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ కోసం అక్టోబర్ 31 వరకు గడువు ఉందని, ఇతర వివరాల కోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం సమీకృత జిల్లా కలెక్టరేట్ రూమ్ నెంబర్ G-6 నందు నేరుగా లేదా సెల్ నెంబర్ : 9182399898 సంప్రదించాలని కోరారు.

24న ఉద్యోగమేళ

నవతెలంగాణ-కందనూలు

జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, నాగర్‌కర్నూల్ వారి ఆధ్వర్యంలో 'ఎస్.కే.సేఫిటీ వింగ్స్ ప్రైవేటు లిమిటెడ్ హైదరాబాద్' వారి ద్వారా 150ఉద్యోగ ఖాళీల భర్తీకి ఉద్యోగ మేళ శనివారం ఉదయం 10.30గంటల నుండి నిర్వహించబడును. ఇందుకు గాను అర్హత ఆసక్తి గల 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ ఆ పైన చదివిన 18 నుండి 35ఏళ్ల లోపు నిరుద్యోగ అభ్యర్థులు అర్హులు. మహిళా అభ్యర్థులకు ప్రాముఖ్యత ఇవ్వబడును. ఉద్యోగ మేళ నేషనల్ ఐటీఐ కళాశాల, మెయిన్ రోడ్, ఆర్టీసీ బస్ స్టాండ్ దగ్గర, నాగర్‌కర్నూల్ నందు నిర్వహించబడును. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12,500 నుండి 18వేల జీతంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, 50కి.మీ లోపు రవాణా సౌకర్యం కల్పించబడును. ఎంపికైన వారికీ శంషాబాద్‌లోని కేఎల్ గ్రూప్ వారి అమెజాన్ వేర్ హౌస్ నందు నేరుగా ఉద్యోగం కల్పించబడును ఇతర వివరాలకు జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం సిబ్బందిని, ఈ క్రింది ఫోన్ నంబర్ల ద్వార సంప్రదించవచ్చును. 9701200819, 9885462005.

అమ్మ కోసం మొక్కలు నాటారు

నవతెలంగాణ-ఉప్పునుంతల

మండల కేంద్రంలో గురువారం 'నాటుదాం ఒక మొక్క అమ్మకోసం' అనే కార్యక్రమంలో భాగంగా మండలం కార్యాలయాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నారాయణ, మండల వ్యవసాయాధికారి రమేష్, కాంగ్రెస్ జిల్లా నాయకులు అనంతరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఏఈఓ మంజుల, పోలీస్ సిబ్బంది, ఈజీఎస్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి చెల్లాచెదరైన పంట పొలాలు



నవతెలంగాణ-పెంట్లవెల్లి

మండలంలోని సింగవరంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువులోకి వెళ్లే పాటు కాలువ తెగి రైతుల వరి పంట పొలాలు కొట్టుకపోయాయి. కాలువ తెగిపో వడంతో గ్రామంలోకి వెళ్లే రహదారిపైకి నీళ్లు చేరి రహదారి పూర్తి స్థాయిలో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం తక్షణమే స్పందిం చి నష్టం పోయిన రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలని, రహదారి మర మ్మత్తు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఈశ్వర్ డిమాండ్ చేశారు.

'మధ్యాహ్న భోజనాన్ని ఎజన్సీలకు ఇవ్వొద్దు'

నవతెలంగాణ-కందనూలు

తెలంగాణలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఏజన్సీలకు ఇచ్చే ప్రతిపాదలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలనీ, పెండింగ్ బిల్లులు, వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఉపాధి కల్పించాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షులు జి.లక్ష్మీ నారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.సాయి రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏజన్సీలకు ఇస్తే 54 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారని వాపోయారు. అక్రమ తొలగింపులు అరికట్టాలనీ, రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి

నవతెలంగాణ-అచ్చంపేట

పట్టణంలోని నడింపల్లి వై చౌరస్తా సమీపంలో కారు, బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. మండల పరిధిలోని బొల్లెట్‌పల్లి గ్రామనికి చెందిన వాల్యాయి బాల రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. పలువురికి తీవ్రగాయాలయ్యాయి. అచ్చంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకొని అటువైపు నుంచి వస్తున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సతీమణి, సీబీఎం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనురాధ సంఘటన స్థలం వద్ద ఆగి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గాయాలైన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోండి



నాగర్‌కర్నూల్ రూరల్ : జిల్లా ప్రధాన ఆస్పత్రిలో పనిచేస్తున్న క్లీనింగ్ కార్మికులకు మూడు నెలల నుండి జీతాలు ఇవ్వకుండా ముఖం చాటేసిన ఎస్ఎస్సి ఏజెన్సీ కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లుపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరారు. అట్లాగే ఆస్పత్రిలో పరిశుభ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్న మహిళా కార్మికులు తమ డ్రస్సులు మార్చుకొనుటకు రూమ్ ఇవ్వకుండా సూపర్డెంట్ డాక్టర్ రఘు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. గత కొంతకాలం నుండి ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రఘును జీతాల గురించి, దుస్తులు మార్చుకొను రూమ్ గురించి అడిగితే మీరు ఎక్కడైనా మార్చుకోండి తనకు సంబంధం లేదని, మహిళలని చూడకుండా అర్థం పర్థం లేని సమాధానంతో దాటవేస్తు న్నారని ఆవేదన చెందారు. ఏరియా ఆస్పత్రిలో ఉన్న 100 బెడ్లకు సరిపోవు కార్మికులతోనే వెట్టి చాకిరీల పనిచేయిస్తు న్నారన్నారు. 330 బెడ్లకు సెక్యూరిటీ, కార్మిక సిబ్బంది మొత్తం కలిపి పేరుకు 35 మంది ఉన్నా, పనిచేసేది మాత్రం 28 మందేనన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి సరిపోను క్లీనింగ్ కార్మిక సిబ్బందిని నియమించని కాంట్రాక్టర్ పై, ఆస్పత్రి సూపరిండెంట్ పై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ తెలంగాణ మెడికల్ ఔట్సోర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. పై అధికారులకు ఎమ్మెల్యేకు, జిల్లా మంత్రికి చెప్పిన ఆస్పత్రి కార్మికుల సమస్యలు తీరలేదన్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రి అయినందుకు ఇప్పుడైనా కార్మికుల సంఖ్య పెంచాలని, లేనిపక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆస్పత్రి కార్మికుల యూనియన్ చేత హక్కుల నోటీస్ ఇచ్చి కార్మిక హక్కుల కోసం ఆందోళన చేపడుతామని మారడు శివశంకర్ పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం

నవతెలంగాణ-నాగర్‌కర్నూల్ రూరల్

ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకా రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంగ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు విజయ, ప్రధాన కార్యదర్శి కవిత, జిల్లా అధ్యక్షులు పి.కృష్ణయ్య గౌడ్, గౌరవ అధ్యక్షులు టి.రామచందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రాములు, కోశాధికారి రాము స్వేరో, ఉపాధ్యక్షులు శ్రావణ్, మండల ప్రధాన కార్యదర్శి భరత్, తెలకపల్లి మండల ప్రధాన కార్యదర్శి భాస్కర్ ఉన్నారు.

బిజినేపల్లి : తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ జానపద కళాకారుల దినోత్సవం గురువారం మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీస్ దగ్గర ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వైస్ ప్రెసిడెంట్ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న జానపద కళలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల మండల అధ్యక్షులు నరిగ నరేందర్, ఉపాధ్యక్షులు బోనాసి లక్ష్మయ్య, జిల్లా మహిళా కార్యదర్శి శివాని పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



వంగూరు : జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. పోలీస్ స్టేషన్ వద్ద విలేకర్లతో ఆయన మాట్లాడుతూ మండలం సీఎం సొంత గ్రామం అయినా కొండారెడ్డిపల్లిలో రైతు రుణమాఫీపై ఎంతవరకు రుణమాఫీ అయిందో తెలుసుకోవడానికి వచ్చిన జర్నలిస్టులైన మిర్రర్ టీవీ విజయ రెడ్డి, మరో జర్నలిస్టు సరిత, ఇతర యూట్యూబ్ ఛానల్స్ వారు ఆ గ్రామంలో విచారిస్తుండగా గ్రామానికి చెందిన రేవంత్ రెడ్డి అనుచరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు మా గ్రామంలోకి రావొద్దని, ఎటువంటి విచారణ చేయొద్దని దాడి చేసి, వాళ్ళ కెమెరాలు, ఫోన్లు ధ్వంసం చేశారన్నారు. అడ్డుకున్న మహిళా జర్నలిస్టులపై అసభ్య పదజాలంతో దూషిస్తూ వారిని మహిళలని చూడకుండా నానా ఇబ్బందులకు గురి చేశారన్నారు. సభ్య సమాజం జర్నలిస్టులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించాలని జర్నలిస్టులు వంగూరు పోలీస్ స్టేషన్‌లో వారి మీద కంప్లైంట్ చేశారని తెలిపారు. అయినప్పటికీ ఇంకా వేధింపులు ఆపలేదని భయాం దోళనలకు గురవుతున్నారు. ఎస్సైని వివరణ కోరగా కొండారెడ్డిపల్లికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ జరిపిస్తామని తెలిపారు.

బియ్యం నాణ్యతను పరిశీలించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్

నవతెలంగాణ-కందనూలు



ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలకు సరఫరా చేసే బియ్యం నాణ్యత ప్రమాణాలు పరిశీలించి పంపాలని, శ్రీ సత్యసాయి పారా బైల్ రైస్ మిల్లు నుండి వచ్చే కాలుష్య సమస్యలను వారంలో పరిష్కరించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఉయ్యాలవాడ సమీపంలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను అదనపు కలెక్టర్ కె.సీతారామారావుతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద బియ్యం నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలకు డీసీఎం ద్వారా సరఫరా చేస్తున్న బియ్యం నాణ్యతను సైతం కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరా చేసే విధానంపై కలెక్టర్ ఆరా తీశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గతవారం క్రింద తాను సందర్శించిన సమయంలో బియ్యంలో ఎక్కువగా పురుగులు ఉన్నాయని, వాటిని అదనపు కలెక్టర్, సివిల్ సప్లై అధికారులతో కలిసి వెళ్లి పరిశీలించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ గురుకులాలకు సరఫరా చేసే బియ్యాన్ని పరిశీలించారు.గతంలో సీజ్ చేసిన ఓల్డ్ స్టాక్ బియ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఓల్డ్ స్టాక్ బియ్యంలో పురుగులు ఉన్నాయని వాటిని వెంటనే వేలం వేయాలని అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్, తాడూరు మండలాల పరిధిలో ఉన్న పాఠశాలలకు సరఫరా అవుతున్న బియ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు.అంతకుముందు నాగర్‌కర్నూల్ నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యలపై గతవారం జిల్లా ఎస్పీకి వినతి పత్రాన్ని సమర్పించారు. కాలుష్య సమస్యలపై కలెక్టర్ ఆరా తీశారు. మిల్లు పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. కాలుష్యాన్ని గల కారణాలను మిల్లు యజమానులను అడిగి తెలుసుకున్నారు. యంత్రాల సాంకేతిక సమస్యతో రైస్‌మిల్లు నుండి బియ్యం పొట్టు లీక్ అవ్వడంతో కాలేజీ పరిసర ప్రాంతాలకు గాలి ద్వారా వెళ్తుందని, వాటిని రానున్న వారం 10రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని,అందుకు కావాల్సిన యంత్రాలను ఇదివరకే తెప్పించామని కలెక్టర్‌కు మిల్లు యజమాని వివరించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రాజేందర్, సంబంధిత అధికారులున్నారు.

సీఎంఆర్ డెలివరీ పూర్తి కావాలి : కలెక్టర్

సీఎంఆర్ డెలివరీ పూర్తి కావాలని, సీఎంఆర్ బియ్యాన్ని ఎఫ్సిఐకి సకాలంలో అందించకుండా తీవ్ర జాప్యం వహించిన మిల్లులపై రూల్ పొజిషన్ ప్రకారం కేసులు నమోదు చేసి, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో 2023-24 ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీపై కలెక్టర్ అదనపు కలెక్టర్ సీతారామారావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 110 రైస్ మిల్లులు ఉన్నాయని, వాటికి ఇచ్చిన లక్ష్యాలను త్వరగా చేరుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విధించిన గడువులోగా సెప్టెంబర్ 30 లోగా సీఎంఆర్ డెలివరీ చేయాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నుండి ప్రభుత్వానికి సకాలంలో నివేదికలు అందించాలని కావున మిల్లర్లు అందరూ దీన్ని పరిగణలో తీసుకుని త్వరగా సిఎంఆర్ లక్ష్యాన్ని చేరుకోవాలి. జిల్లాలో ప్రభుత్వం సేకరించిన ధాన్యం తీసుకున్న రైస్ మిల్లర్లు, సకాలంలో సీఎమ్మార్ అప్పగించడంలో తీవ్ర జాప్యం చేస్తున్న మిల్లర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల తర్వాత అధికారులు ఆయా రైస్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం నిల్వలు విజిలెన్స్ తనిఖీ చేసి, నిల్వల్లో వ్యత్యాసం వచ్చిన మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమయానుగుణంగా ప్రభుత్వానికి బియ్యాన్ని అందించే మిల్లులకు జిల్లా యంత్రాంగం తరపున అట్టి మిల్లులకు ఎల్లవేళలా పూర్తి సహకారం అందిస్తుందని, అలాంటి వారిని గుర్తించి ఇంకా ఆదనంగా వరి ధాన్యాన్ని అందజేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, డిఎం ఆఫీస్ ఏయం రాజేందర్,జిల్లాలోని రైస్ మిల్లర్లు, డీటీలున్నారు.

రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ ధర్నా







నవతెలంగాణ-కొల్లాపూర్

రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ తప్పుడు వాగ్దానాలు ఇచ్చి ఎన్నికల అనంతరం రైతులపై నిబంధనల పేరుతో మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కొల్లాపూర్‌లో రైతాంగం తిరుగుబాటు చేసింది. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి స్వగృహం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు రైతులతో కలిసి బీఆర్ఎస్ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు.అనంతరం ఆర్డిఓ నాగరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కాటం జంబులయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దూ రెడ్డి రఘువరన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల : మండల కేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశం మేరకు అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సూచన మేరకు మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు, అచ్చంపేట తాలూకా పాలసీతల కమిటీ చైర్మన్ కట్ట గోపాల్ రెడ్డి, పార్టీ శ్రేణులు పోచమ్మ చౌరస్తాలో గురువారం రైతు దీక్ష నిర్వహించారు.కార్యక్రమంలో ఉప్పునుంతల గ్రామ అధ్యక్షులు మేడమోని శీను, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వసురాం నాయక్, మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండీ.కాజా, కొట్టే శ్రీను యాదవ్, సుధాకర్ రెడ్డి, శంకర్, దాసర్లపల్లి గ్రామ అధ్యక్షుడు బింగి పర్వతాలు, బాలస్వామి, రైతులు పాల్గొన్నారు.

తిమ్మాజిపేట : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పిలుపు మేరకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలం కేంద్రంలో రైతుల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా విజయవంతమైంది. అనంతరం రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని తహసీల్దార్ జైకే మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బైకాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ రైతుబంధు అధ్యక్షులు వెంకటస్వామి, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ గౌడ్, పకిరా స్వామి, శ్రీనివాస్ యాదవ్, హుస్సేని, కొత్త వెంకటేష్, రజాక్, అయూబ్ ఖాన్, గాలి రాజు, కిల్లే మల్లయ్య, ప్రశాంత్, శివ, తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం గేటు ముందు గురువారం మండల బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి బైఠాయించి ధర్నా చేపట్టి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహ సీల్దార్ జనుంపల్లి శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గంగనమోని కురుమయ్య, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు మంగి విజయ్, చీర్లం బాలస్వామి, మాజీ సర్పంచులు గంగారం అశోక్, తమ్మడి వెంకటయ్య, జంగం వెంకటయ్య, శ్రీనివాసులు, గుడిసె తిరుపతయ్య, మాధవ రెడ్డి, అల్లోజీ, మాజీ కోఆప్షన్ మెంబర్ జాహంగీర్, మండల అధ్య క్షుడు పులేందర్ రెడ్డి, మండల బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ ముదావత్ రాము నాయక్, నాయకులు ఇండ్ల శ్రీనివాసులు, శ్రీశైలం, ఉప్పుగంటి యాదయ్య, సట్ల కృష్ణయ్య, బత్తుల వెంకటేష్, ఎల్లయ్య మేకల లక్ష్మయ్య, సలాం, బాలస్వామి, మహేష్ శ్రీశైలం రెడ్డి, బాష, శ్రీనివాసులు, బాబు తదితరులు ఉన్నారు.



రుణమాఫీపై మోసపు ప్రకటనలు మానుకోవాలి

- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత డాక్టర్ నాగం జనార్దన్ రెడ్డి
- వాస్తవాలను ప్రశ్నిస్తే దాడులు చేస్తారా

నవతెలంగాణ-కందనూలు

రుణమాఫీపై మోసపు ప్రకటనలు మానుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత డాక్టర్ నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలను ప్రకటించి అందులో 13 హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చారని, వాటిలో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. రైతులను మోసం చేసేందుకే అందరికీ రుణమాఫీ చేశామని వ్యాఖ్యలు చేస్తున్నారని వాస్తవానికి 50శాతం మంది రైతులకు రుణమాఫీ అందలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని నాగర్‌కర్నూల్ మండలంలో సింగిల్ విండో బ్యాంకు ద్వారా 1645 మంది రైతులు రుణాలను తీసుకోగా వారిలో 984 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందని, 661 మంది రైతులకు నేటికీ రుణమాఫీ కాలేదన్నారు. ఈ బ్యాంకు ద్వారా రూ.12 కోట్ల 15 లక్షలను రైతులు రుణాలుగా తీసుకుంటే సుమారు రూ.7 కోట్లు మాత్రమే రుణ మాఫీ ద్వారా మాఫీ అయ్యాయని వివరించారు. తాడూరు, తెలకపల్లి, బిజినపల్లి, తిమ్మాజీపేట మండలాల్లో రుణమాఫీ 50శాతం రైతులకు అందలేదన్నారు. ముఖ్యమంత్రి మోసపూరిత హామీలను పక్కనపెట్టి రైతులకు క్షమాపణ చెప్పడంతో పాటు ప్రశ్నించే ప్రతిపక్షాలు జర్నలిస్టులపై దాడులకు దిగడం సరికాదని మండిపడ్డారు. అధికారం ఉందని దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల వల్లే అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. వెంటనే వాటిని పూర్తిగా అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు గ్రామాలలో అరాచకాలు ప్రారంభించారని, వాటిని సహించమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అర్థం రవి, లక్ష్మయ్య, తిమ్మాజీపేట పాండు, బాలా గౌడ్, సుల్తాన్, భీముడు, వెంకటస్వామి, వెంకటయ్య భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.



నిందితులను కఠినంగా శిక్షించాలని రాస్తారోకో

నవతెలంగాణ-కందనూలు

కోల్‌కత్తా వైద్యురాలు హత్యాచార ఘటనకు నిరసనగా జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల విద్యార్థులు గురువారం తరగతులను బహిష్కరించి ఆందోళన చేశారు. ముందుగా జిల్లా జనరల్ ఆస్పత్రి ఆవరణలో మెడికల్ కాలేజీ విద్యార్థులు న్యాయం కావాలంటూ ప్లకార్డులతో నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి నుండి మెడికల్ కాలేజీ విద్యార్థులు ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకుని చౌరస్తాని ముట్టడించి, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మానవహారంగా వైద్య విద్యార్థులు నిలబడి మధ్యలో మృతి చెందిన కోల్‌కత్తా వైద్య విద్యార్థి ఘటనపై నాటక ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శనను చూసిన ప్రజలు, పట్టణవాసులు కంటతడి పెట్టారు. ఈ ప్రదర్శనలో జరిగిన హత్య ఉదంతాన్ని కళ్ళకు కట్టినట్లు నాటక రూపకంగ వైద్య విద్యార్థులు చూపించారు. అనంతరం వైద్య విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వ వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలని మృతి చెందిన వైద్య విద్యార్థికి న్యాయం చేయాలంటూ వైద్యులకు రక్షణ కల్పించాలంటూ తీవ్ర నిరసనను వ్యక్తం చేస్తూ ర్యాలీని ముగించారు. నిరసనలో మెడికల్ కళాశాల విద్యార్థులు నర్సింగ్ విద్యార్థులున్నారు.



కోడేరు : భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలని మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉప అధ్యక్షులు కార్తీక్ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మహిళల పట్ల అత్యాచారాలు పెరిగిపోతున్నాయని మహిళల పట్ల కఠినమైన చట్టాలు తీసుకొస్తే ఇలాంటివి జరగవన్నారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. మహిళల పట్ల కఠినమైన చట్టాలు తీసుకురాని ఎడల విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నిందితులను శిక్షించే వరకు ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో పవన్, శ్రీకాంత్, కార్తీక్, పావని, ప్రవళిక, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.







షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్.దేశ్య నాయక్

నవతెలంగాణ-బల్మూరు

షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎల్.దేశ్యనాయక్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) బల్మూరు మండల కమిటీ సమావేశం కొండనాగుల గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతుకు ఒక్కొక్కరికి రెండు లక్షల రుణమాఫీ ఇస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని షరతులు లేకుండానే రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో, అనేక బహిరంగ సభలలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని డిసెంబర్ 9న సంతకం పెడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సభలలో బహిరంగంగానే చెప్పారన్నారు. తీరా చూస్తే ఇప్పటికీ మూడు దఫాల రుణమాఫీ చేస్తే 40శాతం మందికి కూడా రుణమాఫీ వర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకపోతే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి శంకర్ నాయక్, మండల నాయకులు ఎండీ.లాల్ మహ్మద్, ఆంజనేయులు, భాస్కర్, భారీమం, శివ, నాగయ్య, లక్ష్మయ్య, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ డిపోకి మూడో స్థానం



నవతెలంగాణ-కందనోలు

మహబూబ్‌నగర్ రీజియన్‌లో నాగర్‌కర్నూలు ఆర్టీసీ డిపో మూడో స్థానంలో నిలిచినట్లు రీజినల్ మేనేజర్ శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా రెండు రోజులపాటు ఆక్యుపెన్సీ రేషియోలో మూడో స్థానంలో నిలిచిందన్నారు. అలాగే రాష్ట్రస్థాయిలో 11వ స్థానంలో ఉందన్నారు. ఆర్ఎం డిపోలో సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్, గ్యారేజీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు



నవతెలంగాణ-తిమ్మాజిపేట

మండలంలోని బాజీపూర్‌లో ఉన్న పాఠశాలలో విధులు నిర్వహించి పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యాయురాలు శివరాణికి తోటి ఉపాధ్యాయ బృందం విద్యార్థులు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి పాఠశాలకు వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు మనుషా, పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు వెంకట్ రెడ్డి, మోహన్ గౌడ్, బుచ్చి రెడ్డి, మాసయ్య, బొందయ్య శివ, వెంకటయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓలకు దిశా నిర్దేశం

నవతెలంగాణ-కోడేరు



తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు తహసీల్దార్ కె.విజయ కుమార్ ఎస్ఎస్ఆర్-2025 గురించి కొన్ని సూచనలు చేశారు. ప్రతి బీఎల్ఓ హౌస్ టు హౌస్ ఓటర్ల ను నమోదు చేయాలి. 18ఏండ్లు నిండిన ప్రతి ఓటర్‌ను ఫారం-6లో నమోదు చేయాలి. ప్రతి పోలింగ్ స్టేషన్లలో చనిపోయిన వారిని గుర్తించి వారి ఇంట్లో వారి చేత ఫారం-7లో దరఖాస్తు చేయించాలి. కుటుంబంలో వున్న అందరి ఓటర్లను ఒకటే బూతులోకి వచ్చేటట్లు గుర్తించాలి. ఇంటి నెంబరు, ఇంటి పేరు, లింగము, ఫోటో తప్పు, ఇటువంటి వాటిని ఫారం-8లో దరఖాస్తు చేయించి వాటిని పరిశీలించాలి. ప్రతి బూత్ లెవెల్ ఆఫీసర్ తప్పకుండా పై వాటిని రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఆ 40 రిజిస్టర్‌లను బీఎల్ఓలకు అప్పగించారు. ప్రతి రోజూ 20 ఇండ్లు తప్పకుండా వెరిఫికేషన్ చేయాలని సూచించారు. ఈ పక్రియను సూపర్ వైజర్‌లు పర్యవేక్షిస్తారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, సూపర్ వైసర్లు, జయలక్ష్మి, జంబు లయ్య, సురేందర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బిజినేపల్లి

మండలంలోని గుడ్ల నర్వ గ్రామానికి చెందిన దాసరి సత్యం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచి మల్లికార్జు న నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేసి, వారికి మనోధైర్యాన్ని చెప్పి అన్నివేళలో మీకు అండగా ఉంటానని భరోసా కల్పించాడు. కార్యక్రమంలో బాలలక్ష్మయ్య, రాములు, కే.రాజు ఉన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలు భేష్ : కలెక్టర్

నవ తెలంగాణ - ఊట్కూర్

విద్యార్థుల సామర్థ్యాలు భేష్ అని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఉపాధ్యాయులను అభినందించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల జీపీఎస్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని ఐదవ తరగతి విద్యార్థుల బోధన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల ఆంగ్లభాషాపై పట్టును చూసి అక్కడ ఉన్న ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులకు ఆంగ్లంలో పాఠ్యపుస్తకాలలోని ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఈ సందర్భంగా అక్కడున్న ఉపాధ్యాయులతో కలెక్టర్ మాట్లాడుతూ విద్య బోధనపై ఇంకా ఏవైనా శిక్షణ అవసరమా అని తదుపరి మూడో తరగతి విద్యా ర్థులతో జాలీఫొనిక్స్ ద్వారా విద్యార్థులచే ఆంగ్ల పదాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాపరంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నారాయణపేట జిల్లాకే ప్రత్యేకంగా నియమించిన అకడమిక్ ఇన్స్ట్రక్టర్లను ఇవ్వడం జరిగిందని. విలువలతో కూడిన బోధన జరగాలని బడి అంటే బాధ్యత కాదని కుటుంబంగా భావించి నిబద్ధ తతో పనిచేస్తారనే స్థానిక అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. విద్యాశాఖలో గత సంవత్సరం సాధించిన ప్రగతి మరింత మెరుగ్గా నిర్వ హించి, జిల్లాని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఏ ఎమ్.ఓ విద్యాసాగర్,ఎస్ ఓ శ్రీనివాస్ , తహసీల్దార్ ,ఎం పీ డీ ఓ, ధనంజయ గౌడ్ , ఎం. పీ ఓ, రాజు, ప్రధానోపాధ్యాయులు పద్మ పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'కు తరలిన సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ కార్యకర్తలు



నవతెలంగాణ - మక్తల్

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆగష్టు 22న (గురువారం) ఇందిరా పార్క్ వద్ద చేపట్టిన ధర్నా కార్యక్రమానికి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కార్యకర్తలు తరలిన వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు ఎస్ కిరణ్, సీపీఐ(ఎంఎల్)మాస్ లైన్ పార్టీ నాయకులు భగవంతు, ఐ ఎఫ్ టీయూ జిల్లా ఉపాధ్యక్షులు భుట్టో, పీ.డీ. ఎస్.యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్‌లు మాట్లాడుతూ గత సంవత్సరం డిసెంబర్లో ప్రజలకు అనేక వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఏడు నెలలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. గత జనవరి నెలలో ఆరు నెలల క్రితం ప్రజా పాలన దరఖాస్తులను ప్రజలు సమర్పించారని, పేదలందరికీ కొత్త గా ఆసరా పింఛన్లు రూ. 4000, వికలాంగులకు రూ. 6000 పెంచి ఇస్తామని, అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, వ్యవసాయ కూలీలకు, సంవత్సరానికి రూ.12,000 జీవన భృతి, రైతు భరోసా ఎకరానికి రూ.15000 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇందిరమ్మ పథకంలో ఇల్లు మంజూరు చేస్తామన్న ఒక్కో ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు ఇస్తామన్న ప్రజాపాలనలో విస్తృతంగా దరఖాస్తులు తీసుకున్నా వాటి ఊసే లేకుండా పోయిందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్న ఇప్పటివరకు రైతు భరోసా రైతులకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 10 ఎకరాల వరకు రైతు భరోసా తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో రైతులు ధరణిలో భూ సమస్యలు పరిష్కారం కాక నేటికీ సతమతమవుతున్నారన్నారు . ధరణిని రద్దు చేస్తాం అన్న రేవంత్ రెడ్డి మాటలు ఏమయ్యాయని నిలదీశారు. నిరుద్యోగులందరికీ భృతి కల్పించాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్‌ను గద్దె దించి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు సమర్థవంతమైన ప్రజాపాలన అందిస్తామన్న రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటడం లేదని ఎద్దేవా చేశారు . వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం , రూ.12000 పిన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్ బకాయిలను ,ఆరోగ్యశ్రీ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకులు మహిమూద్ , వెంకటేష్, మల్లేష్, అజయ్,శేఖర్, అశోక్, పవన్, గోవిందు, నరేష్, రవి ,అయ్యప్ప, హరి, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, విద్యార్థినులకు అవగాహన



నవ తెలంగాణ - నారాయణపేట

ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు.. నారాయణపేట మండలం బైరం కొండ శివారులోని గురుకుల స్కూల్ వద్ద విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు షీ టీం పోలీసులు సామాజిక అంశాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు బాల రాజు, సమీన మాట్లాడుతూ విద్యార్థులు స్కూలు, కళాశాలల్లో ఎవరైన వేధింపులకు గురిచేసిన అలాంటి వారి సమాచారం వెంటనే షీ టీం పోలీసులకు సెల్ ఫోన్ నంబర్ 8712670398 కి సమాచారం ఇవ్వాలన్నారు. చాలామంది విద్యార్థులు, మహిళలు తెలిసిన వారితో వేధింపులకు ఎక్కువ గురి అవుతున్నారని , అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. హాస్టల్లో ఉన్నప్పుడు ఎవరైనా కొత్త వ్యక్తుల మాటలు నమ్మరాదని, తోటి విద్యార్థులతో గొడవ పడరాదని, చదువులో తోటి విద్యార్థులతో పోటీ పడి చదువాలని చెప్పారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, ప్రతిరోజు క్రీడలు ఆడాలని తమకు నచ్చిన క్రీడపై ఆసక్తి కనబర్చాలన్నారు.క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులు మానసికంగా, శారీర కంగా దృఢంగా ఉంటారన్నారు. తల్లిదండ్రులు అందుకు ప్రోత్సహించాలని సూచించారు.విద్యార్థులు చిన్నతనం నుంచి క్రీడలపై దృష్టి సారించాలన్నారు.

పార్లమెంటరీ కమిటీతో .. విచారణ జరిపించాలని నిరసన



నవ తెలంగాణ - మక్తల్

టీపీసీసీ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్త ఆదానిపై జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోనందున గురువారం హైదరాబాద్లోని గన్ పార్కు వద్ద కాంగ్రెస్ ముఖ్య నాయకులు, శ్రేణులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు నాగర్కర్నూల్ ఎంపీ డా మల్లు రవి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీ హరి నందిగామ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి : కలెక్టర్

నవ తెలంగాణ - నారాయణపేట



ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ సమావేశం హాల్లో జిల్లా అధికారులతో కాడ, గ్రీవెన్స్‌పై సమీక్ష నిర్వహించారు. కాడ గ్రీవెన్స్ డే కి వచ్చి ఫిర్యాదులను అన్ని శాఖల అధికారులు పరిష్కరించాలన్నారు. జాబ్ గురించి పెండింగ్ గ్రీవెన్స్ గురించి అడిగి తెలు సుకున్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ పై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని, బిల్డింగ్ కన్స్ట్రక్షన్ ఇరిగేషన్ గురుకుల పంచాయతీరాజ్ ఎక్సైజ్ ట్రాన్స్పోర్ట్ పబ్లిక్ గురించి వచ్చే అర్జీలు ఆయా శాఖల నుంచి పరిష్కరించాలన్నారు. గ్రీవెన్స్ ఎక్కువగా వచ్చిన శాఖ అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల వారికి వచ్చిన అర్జీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : కలెక్టర్

నవతెలంగాణ - నారాయణపేట

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కలెక్టర్ సిక్త పట్నాయక్ అన్నారు. గురువారం సింగారం గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్ర మంలో కలెక్టర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో మొక్కలు నాటడం వల్ల వర్షాలు సకాలంలో కురుస్తాయన్నారు. మొక్కలతో స్వచ్ఛమైన గాలి వస్తుందని అన్నారు. డీఆర్డీఓ మొగులప్ప మాట్లాడుతూ వన మహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఆరు మొక్కలు నాటాలని సూచించారు.కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ - ఊట్కూర్

ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పగిడిమారి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆసిఫా అన్నారు. నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని పగిడిమారి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్య నివారణకు పాటు పడదాం అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ మహాలక్ష్మి , మాజీ ప్రజా ప్రతినిధులు , జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సీనియర్ మేట్ ఇస్మాయిల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


ఊట్కూర్‌లో..


నారాయణపేటలో..

అబద్ధాలు చెప్పి అధికారంలోకి..

- మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి

నవ తెలంగాణ - నారాయణపేట

కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ కార్యనిర్వాక అధ్యక్షులు కేటీఆర్ పిలుపుమేరకు.. గురువారం నారా యణ పేట జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఆంక్షలు లేకుండా రైతులకు రెండు లక్షల రూపా యల రుణ మాఫీ చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలు చెప్పి ప్రజలను , రైతులను అమాయకులను చేసి అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని అన్నారు. డిసెంబర్ 9 కట్ ఆఫ్ తేదీ వరకు 2 లక్షల రుణమాఫీ రైతులకు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను గోల్మాల్ చేసి పబ్బం గడుపుకుంటున్నారని, ఇదివరకు రైతులకు అందరికీ రుణమాఫీ కాలేదని అన్నారు. రుణమాఫీ విషయంలో ఎన్నో ఆంక్షలు విధిస్తు న్నారన్నారు.ఆధార్‌కార్డులో తప్పులు ఉన్నా యని, రుణం తీసుకున్న తర్వాత రెన్యువల్ చేయలేదని ఎన్నో ఇబ్బందులకు రైతులను బ్యాంకర్లు గురి చేస్తున్నారని అన్నారు. మొదటిసారిగా బ్యాంకు నుంచి రైతులు రుణం తీసుకునేటప్పుడు లేని ఆంక్షలు ఇప్పుడు ఎందుకు అని ప్రశ్నించారు. ఒకపక్క రైతులు రుణమాఫీ కాలేదని, రైతుబంధు రాలేదని , రూ.4000 పింఛన్ రాలేదని ఇబ్బందులు పడుతు న్నారన్నారు. రూ.2లక్షల రుణమాఫీ పూర్తి బోగస్ అని, మేనిఫెస్టోలో మాటిచ్చినా అతిపెద్ద మోసం, దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రైతుల ఆందో ళనలు, నిరసనలు ప్రారంభమయ్యాయని, బ్యాం కులు, అధికారుల చుట్టూ తిరుగుతూ మొర పెట్టు కుంటు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 9వ తేదిన ఏక కాలంలో 2 లక్షల రుణ మాఫీ చేస్తామని పూర్తిస్థాయిలో చేయలేదన్నారు.రేషన్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగం, ఇన్కంటాక్స్ వారికి రుణ మాఫీ లేనట్టే. రైతు బంధు డబ్బులు ఎగ్గొట్టి రుణమాఫీకి వాడుకున్నారన్నారు. ఇక రైతులకు రైతు బంధు బంద్. అర్హులైన రైతుల్లో పావు శాతం మందికి కూడా మాఫీ కాలేదని, రుణ మాఫీ మొత్తం అయ్యిందంటూ సీఎం ఒక వైపు ప్రగాల్బాలు పలుకుతుంటే మరోవైపు మంత్రులు మాత్రం రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాలేదంటూ ఇంకా కొనసాగుతుందని చెప్పుకొంటూ వస్తునారని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. రాబోవు రోజులలో రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పట్టణ, మండల కమిటీ మెంబర్లు, రైతుబంధు సమితి కమిటీలు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మాజీ కౌన్సిలర్

నారాయణపేట మాజీ ఎమ్మెల్యే , బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్. రాజేందర్‌రెడ్డికి నారాయణపేట మూడో వార్డు మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య రాఖీ కట్టారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన మహా ధర్నా కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా మాజీ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య ఎమ్మెల్యే చేతికి రాఖీ కట్టి అన్నదమ్ముల అనుబంధానికి ప్రతీతిగా నిలిచింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎస్సార్ రెడ్డి మాట్లాడుతూ సోదర,సోదరీమణుల ప్రేమనురాగాలు, ఆత్మీయతలకు ప్రతీక రాఖీ పండగ అని అన్నారు.



రుణమాఫీ చేయాలి : మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ - మక్తల్

రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి అన్నారు. గురువారం మక్తల్ పట్టణం లోని అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలభిషేకం చేసి,167 జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణాలు మొత్తం మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఎలాంటి కండిషన్స్ లేకుండా రుణమాఫీ చేస్తామని, ఇప్పుడు అనేక కండిషన్స్ పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు ఆశిరెడ్డి, మక్తల్ టౌన్ అధ్యక్షులు చిన్న హనుమంతు, మగనూర్ మండల సింగిల్ విండో చైర్మన్ వెంకట్ రెడ్డి,మక్తల్ మాజీ మార్కెట్ చైర్మన్ రాజేష్ గౌడ్,ఊట్కూరు మాజీ జెడ్పిటిసి మగనూర్ మండలం అధ్యక్షులు ఎల్లారెడ్డి,ఆత్మకూరు మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్,నర్వ మండల అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి,ఊట్కూర్,మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి,సీనియర్ తెలంగాణ ఉద్యమ కారుడు పూజారి కురుమయ్య, కృష్ణ మండల మాజీ వైస్ ఎంపీపీ,మధుసూదన్ రెడ్డి,మారుతి గౌడ్, కౌన్సిలర్ మొగులప్ప, కౌన్సిలర్ జగ్గలి రాములు, గాల్ రెడ్డి, నర్సిరెడ్డి, మల్లారెడ్డి, హనుమంత్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, నాగభూషణ్, పారేవుల ఆశిరెడ్డి, శివప్ప, శంకర్ గౌడ్,ఈశ్వర్ యాదవ్, శివారెడ్డి,పల్లె మారప్ప, తరుణ్, సాగర్, రియాజ్, వన్నెకారి, కృష్ణ యాదవ్, సూతరి రవి, పల్లె మరెప్ప పాల్గొన్నారు.

తంగిడిగిలో తాగునీటి ఎద్దడి

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో గ్రామస్తులు

నవ తెలంగాణ - క్రిష్ణా



మండలంలోని తంగిడిగి గ్రామంలో తాగినీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. తాగునీటి సమస్యను అధికారులు ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల నుంచి గ్రామానికి నీటి సరఫరా కావట్లేదని అధికారులకు విన్నవించిన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో తాగునీటి కోసం ప్రధానంగా ఉన్న బోరు బావి చెడిపోయి పది రోజులవుతున్న మరమ్మతులు చేయించకుండా గ్రామ కార్యదర్శి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని నీటి ట్యాంకును కడగమని విన్నపించిన పట్టించుకునే వారు లేరని, ట్యాంక్ ఓపెన్‌గా ఉన్న నీటి ట్యాంక్‌లో పక్షుల వ్యర్థాలు, వర్షపు నీరు చేరి నులిపురుగులు నీటిలో వస్తున్న ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. నీటి కొరకు చేతిపంపులే ఆధారంగా ఉన్నాయని అక్కడికి వెళ్లి బిందెలు కడువలల్లో నీళ్లను తీసుకు వస్తున్నామని పేర్కొంటున్నారు. ఆ ఉన్న ఒక్క చేతిపంపు చెడిపోతే గ్రామానికి నీరు లేకుండా పోతుందని, మిషన్ భగీరథ నీరు ఇప్పటివరకు మా గ్రామానికి అసలుకే రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలోనే తాగునీటిసమస్య ఉంటే రానున్న రోజుల్లో ఎంత ఇబ్బంది పడాల్సి వస్తుందోనని గ్రామస్తులు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామ సమీపంలోనే పారుతున్న కృష్ణ, బీమా రెండు నదులు ఉన్న తాగునీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లి మినరల్ వాటర్‌ను కొనుక్కుని తాగడం జరుగుతుందని వాపోయారు. తాగునీటి విషయమై ఏ నాయకుడు, అధికారులు కూడా స్పందించక పోవడం చాలా బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు నీటి సమస్యను పరిష్కరిం చేందుకు తగు చర్యలను చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ - నారాయణపేట

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నోడల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, కొత్త ఆర్ఓఆర్ చట్టం మీద రైతు సంఘాలు ప్రజా ప్రతినిదులు ప్రముఖులతో జరిగిన అభిప్రాయ సేకరణ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో పలు సూచనలు, సలహలతో కూడిన వినతి పత్రాన్ని గురువారం కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ గతంలో ధరణిలో జరిగిన పొరపాట్ల కారణంగా అనేకమంది రైతులు వారి పట్టా భూముల్ని నాలలో విస్తీర్ణం తక్కువ నమోదు కావడం, ఇనాం భూములు ప్రభుత్వ భూములకు పాస్ పుస్తకాలు రాక తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నప్పటికీ సమస్యలు పరిష్కారం గాక ఇబ్బంది పడుతు న్నారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం కొత్త ఆర్ఓఆర్ చట్టంలో అయినా పరిష్కారం చేయాలని, భూ సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో ఆర్ఓఆర్ నిర్వహించాలని, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేక నోడల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఏ పట్టాదారు కాలంతో పాటు గతంలో ఉన్న సాగుదారు కాలం కూడా ఉండాలని, భూమిని అమ్మకం , కొనుగోలు చేసినప్పుడు కర్ణాటక పద్ధతిలో సర్వే నిర్వహించి సర్వే రిపోర్ట్ ఇచ్చిన తర్వాతనే రిజిస్ట్రేషన్ చేయాలని అన్నారు. పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూముల్లో ఇప్పటికి కూడా చాలామందికి పాత పాస్ పుస్తకాలు ఉన్న కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వలేదన్నారు. అట్లాంటి భూములను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పేద రైతులకు న్యాయం చేయాలని కోరారు. సాదా బైనామా కింద గతంలో చేసుకున్న దరఖాస్తులను పరిష్కరించాలని , కొత్తవి కూడా సాదా బైనామా దరఖాస్తులకు అవకాశం కల్పించాలని పలు సూచనలు సవరణలు చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, నరసింహా, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన



నవ తెలంగాణ - ఊట్కూర్

మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ భవానీ గురువారం బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తల్లిబిడ్డల సంరక్షణ, తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత,వ్యాధి నిరోధక టీకాలు ,పాలు పట్టే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి విజయకుమార్ , పర్యవేక్షకులు నరసింహులు , ఆశా కార్యకర్తలు ఉమా సుష్మిత, కొల్లూర్ , మల్లేపల్లి గ్రామాల బాలింతలు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడుపొద్దు : ఎస్సై



నవ తెలంగాణ - ఊట్కూర్

మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్సై కృష్ణంరాజు అన్నారు. మండలంలోని ఓబ్లాపూర్ గ్రామ శివారులో గురువారం ప్రధాన రహదారిపై ఎస్సై కృష్ణంరాజు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, కార్ అద్దలకు బ్లాక్ ఫిలిం ఉపయోగించరాదని ఎవరైనా కార్ అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉపయోగిస్తే వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. వాహన వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదు. వాహనాలు నడిపేవారు విధిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలన్నారు. వాహనదారులు రోడ్డుపై వాహనాలను పార్కు చేయరాదని, టూ వీలర్స్ పై ఇద్దరకు మించి ప్రయాణించరాదన్నారు. ఆటోలలో ఎక్కువ మంది పిల్లలను అలాగే కూలీలను ఎక్కించుకోరాదని సూచించారు. ఆటోలో సీట్ పర్మిట్ ఉన్నంత వరకే ప్యాసింజర్ ఎక్కించుకోవాలి. డ్రైవింగ్ చేస్తూ సెల్ఫోన్ మాట్లాడరాదన్నారు. పరిమిత వేగంలో వాహనాలు నడపాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీస్‌లకు సహకరించాలని కోరారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు ఈ కార్యక్రమంలో పోలీస్ లు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

నవ తెలంగాణ - ఊట్కూర్/మక్తల్

అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై కృష్ణంరాజు అన్నారు. గురువారం దాసరి దొడ్డి గ్రామం నుంచి దామరగిద్దకు ఎలాంటి పర్మిషన్ లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను మండలంలోని మల్లేపల్లి గ్రామ శివారులో టాస్క్ ఫోర్స్, ఉట్కూర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పట్టుకొని విచారించారు. టిప్పర్ ఓనర్ రామకృష్ణ, గుడిగండ్ల గ్రామం అని, టిప్పర్ డ్రైవర్ యాకూబ్ అలీ గుణ్ముక్ల గ్రామం అని తెలుపగా టిప్పర్‌కు ఎలాంటి పర్మిషన్ లేనందున పోలీస్ స్టేషన్ కి తరలించి టిప్పర్ డ్రైవర్, ఓనర్ల పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు.. మక్తల్ పోలీసులు రెండు టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు మక్తల్ ఎస్ఐ-2 ఆచారి తెలిపారు.పోలీస్ స్టేషన్ పరిధిలోని దాసరిదొడ్డి వాగు నుంచి నారాయణపేటకు అక్రమంగా ఇసుక తరలిస్తుంటే రెండు టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిపారు. పప్పుల నరేష్ , తిప్రస్పల్లి గ్రామ డ్రైవర్, యజమాని విజయ సాగర్ గౌడ్, తిప్రాస్ పల్లి గ్రామం, రెండవ వాహనం గుణ్ముక్ల ఆనంద్, తిప్పరస్‌పల్లి, గ్రామం. డ్రైవర్ ,యజమాని కురువ వీరేష్, పెద్ద జట్రం గ్రామ వ్యక్తులకు చెందిన రెండు టిప్పర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు.. మక్తల్ పోలీసులు రెండు టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. టిప్పర్ల ఓనర్లు, డ్రైవర్ల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
జోగులాంబ-గద్వాల
శుక్రవారం | ఆగస్టు 23, 2024 | www.navatelangana.com

భారత్ మాలకు రైతులు సహకరించాలి

• కలెక్టర్ బీ ఎం సంతోష్



నవ తెలంగాణ - జోగులంబ గద్వాల/గట్టు

గట్టు అభివృద్ధి కోసం, భారత్ మాల రోడ్డు నిర్మాణ పనులకు రైతులు సహకరించాలని కలెక్టర్ బీ.ఎం సంతోష్ అన్నారు. గురువారం గట్టు మండల తహసీల్దార్ కార్యాలయంలో హైవే అథారిటీ అధికారులతో రహదారి నిర్మాణం సంబంధిత భూముల వివరాలను, భారమాత రహదారి మాపింగ్ ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించడంతో పాటు, మిగులు భూములకు సర్వీస్‌రోడ్లు, బ్రిడ్జీ ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను పరిగణణలోకి తీసుకొని, రైతులకు నష్టపరిహారం కింద రైతుల కోరిక మేరకు .. రెండో విడతగా పది రోజులలో డబ్బులను అందేలా తక్షణమే చర్యలు తీసుకుంటామని అన్నారు. సర్వే నెంబర్ 300 మాచర్ల నుంచి అరగిద్దకు రోడ్డు లింక్ కల్పిస్తామన్నారు. బ్రిడ్జీ ,అండర్ పాస్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరిత రాణి, ఎన్.హెచ్.ఎ.ఐ మేనేజర్ కోట బాబు, సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ చట్టంపై సమావేశం ..

నూతనంగా ఏర్పాటు చేయనున్న రెవెన్యూ యాక్ట్ (ఆర్ఓఆర్) చట్టం - 2024 పై అభిప్రాయ సేకరణకు జిల్లాలోని మేధావులు, సీనియర్ సిటిజెన్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బీ.ఎం. సంతోష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న (శుక్రవారం) సాయంత్రం 4:00 గంటలకు కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశంలో సీనియర్ సిటిజన్లు, మేధావులు, రైతు సంఘాల సభ్యులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి వారి అమూల్యమైన సూచనలు, సలహాలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. చట్టాన్ని పక్కాగా అమలుపరిచేందుకు తమ సూచనలు, సలహాలను అందజేయాలని కలెక్టర్ కోరారు.

'చిన్నోనిపల్లి'ని పరిశీలించిన తహసీల్దార్



నవతెలంగాణ - గట్టు

గత 3 రోజులుగా కురుస్తున్న వర్షాలకు.. గట్టు మండలం చిన్నోనిపల్లి గ్రామంలోకి వర్షపు నీరు, వివిధ వాగులు వంకలు కాలువల ద్వారా నీరు గ్రామంలోకి చేరుతోంది. బుధవారం నవతెలంగాణలో ప్రమాద పుటంచున చిన్నోనిపల్లి అనే శీర్షకతో వచ్చిన కథనానికి తహసీల్దార్ స్పందించారు. గురువారం చిన్నోనిపల్లి గ్రామానికి గట్టు తహసీల్దార్ సరిత రాణి చేరుకొని గ్రామాన్ని పరిశీలించారు. ఆర్అర్ సెంటర్‌కు అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించనందున తక్షణమే చర్యలు తీసుకొని కింది భాగంలో ఉన్న గండి దగ్గర కాలువ నుంచి నీటిని డ్యాం బయటకు పంపే విధంగా జేసీబీ, హిటాచీలతో పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్ సునీల్‌కు సూచించారు. ఆర్ అండ్ ఆర్ సెంటర్‌లో మౌలిక వసతులైన పాఠశాల , అంగన్వాడీ సెంటర్ , గ్రామ పంచా యతీ కార్యాలయం వంటి వసతులు ఏర్పాటు కానందున గ్రామంలోకి నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ విజయ కుమార్ ఈ సమస్యను పోస్ద్వారా శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి, జిల్లా కలెక్టర్ కి తెలియజేస్తామని పేర్కొన్నారు.

వరద బీభత్సం

• నిలిచిన రాకపోకలు • ఇబ్బందుల్లో ప్రజలు



నవతెలంగాణ - ధరూర్

జోగులాంబ గద్వాల జిల్లాలోని ధరూర్ మండల పరిధిలో నీలహళ్లి గ్రామంలో వరద ఉధృతి కారణంగా జనజీవనం స్తంభించింది. నీలహళ్లి గ్రామ శివారులోని వాగు బ్రిడ్జీని పట్టించుకునే నాధులే లేరని గ్రామస్తులు , విద్యార్థులు,రైతులు వాపోతున్నారు. వాగు బ్రిడ్జీ రూ.3 కోట్లు మంజూరైనప్పటికీ కాంట్రాక్టర్ బ్రిడ్జీని పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి త్వరగా బ్రిడ్జ్ పనులను పూర్తి చేయాలనీ కోరుతున్నారు. గ్రామంలోని వాగు పొంగిపొర్లడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని పేర్కొంటున్నారు. గద్వాలకు కర్ణాటక- రాయచూర్ కు వెళ్లాలన్న వాగు దాటి వెళ్లాల్సివస్తుందని, నీలహళ్లి గ్రామం నుంచి 2 కిలో మీటర్లు ఉన్న పాత పాలెం గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల కు వెళ్లాలనుకున్న వాగు దాటే వెళ్లాల్సి వస్తుండటంతో చాలా ఇబ్బందిగా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే బ్రిడ్జీని నిర్మాణం పూర్తిచేసి ఇబ్బందులు లేకుండా చూడాలని నీలహళ్లిగ్రామస్తులు, ఆటోయునియన్ రైతులు కోరుతున్నారు.

మానవ మనుగడకు చెట్లే ఆధారం


• మాజీ ఎంపీపీ విజయకుమార్



నవతెలంగాణ - గట్టు

మానవ మనుగడకు చెట్లే ఆధారం అన్ని మాజీ ఎంపీపీ జే.విజయ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని చాగదోన గ్రామంలో జెడ్.పీ.హెచ్.ఎస్, ప్రైమరీ స్కూల్లో విద్యార్థులతో కలిసి గట్టు మాజీ ఎంపీపీ జే. విజయ్ కుమార్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని, మానవ మనుగడకు చెట్లు మూలాధారం అన్నారు. చెట్లతో మంచి వాతా వరణం ఏర్పడి సకా లంలో వర్షాలు కురుస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్లు మోహన్ రెడ్డి ,అయ్య స్వామి , పంచాయితీ కార్యదర్శి మహేష్, రవీందర్‌గౌడ్ , పరమేష్ స్వామి ,శివప్ప గుడిసె నరసింహులు, వడ్డే నాగన్న ఒరుగు వెంకటేష్ , భాష్కర్ , నగేష్ , నాయకులు , కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ - గట్టు

మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ కార్యకర్త నరసింహులు గౌడ్ గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ ఆయన స్వగ్రామానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్, సత్యన్న గౌడ్ ,సింగల్ విండ్ డైరెక్టర్ మహేశ్వర్ రెడ్డి, మిట్టదొడ్డి సర్పంచ్ సీడ్రిక్, బడేశాబ్‌గౌడ్, వీరన్నగౌడ్ , నరసింహులు, తిమ్మప్ప ఉన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : ఎస్పీ



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఏడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ఎస్ఐ సురేష్‌బాబు కుటుంబ సభ్యులకు విడో, కార్పస్ ఫండ్ చెక్‌లను ఎస్పీ టీ. శ్రీనివాస రావు తమ ఛాంబర్‌లో ఆయన భార్య సువర్త మ్మకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ సాయుధ దళ కార్యాలయంలో ఏఆర్ఎస్ఐ గా విధులు నిర్వహి స్తున్న సురేష్‌బాబు ఈ సంవత్సరం జనవరి నెలలో అనారోగ్యం తో మృతి చెందాడని పేర్కొన్నారు. దీంతో కార్పస్ ఫండ్ కింద రూ.50 వేల చెక్కును, విడో ఫండ్ కింద రూ.10వేల చెక్‌ను అందించి కుటుంబ ప్రస్తుత స్థితిగతులను ఎస్పీ అడిగి తెలుసుకోవడంతో పాటు, వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో పాటు కుటుంబాలకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏ. ఓ సతీష్ కుమార్ , సూపరింటెండెంట్ నయీం, బాధిత కుటుంబసభ్యురాలు సువర్తమ్మా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి : కలెక్టర్

నవతెలంగాణ - గట్టు

గట్టు, కేటీదొడ్డి మండలాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచి, పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు అందించాలని కలెక్టర్ బీ.ఎం సంతోష్ ఉపాధ్యాయులకు ఆదేశించారు.గురువారం గట్టు మండలంలోని టీజీడబ్ల్యూఆర్ జే. సీ బాలికల పాఠశాలలో "అస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం" ఆధ్వర్యంలో జరిగిన "చాంపియన్స్ ఆఫ్ ఛేంజ్" కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు కలెక్టర్‌ను ఘనంగా స్వాగతించారు. గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో విద్యార్థుల విద్యా పరిస్థితులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద గట్టు మండలాన్ని దేశంలోని వెనుకబడిన 500 మండలాల్లో ఒకటిగా ఎంపిక చేశారని అన్నారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని 79శాతం నుంచి 89శాతంకి పెంచడం జరిగిందని తెలిపారు. గతం కన్నా 10శాతం ఎక్కువ శాతం పెరిగిందని, ఈ శాతాన్ని మరింత పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల హాజరు శాతం , ఫలితాల మెరుగుదల కోసం అధికారులు కృషి చేయాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులు డ్రాపౌట్స్ ఆపేందుకు ఉపాధ్యాయులు పేరెంట్స్‌కు అవగహన కల్పించాలన్నారు. పిల్లలను తిరిగి పాఠశాలలకు చేర్పించేందుకు ప్రత్యేకమైన ప్రయత్నాలు చేయాలన్నారు. ఇందుకు ఉపాధ్యాయులకు అవసరమైన సహాయం అందిస్తామని అన్నారు. పాఠశాలల వారీగా విద్యార్థులను గుర్తించాలన్నారు. పాఠశాలలో పిల్లలను సీడ్ పత్తి చెను పంపించే తల్లిదండ్రులపై లేబర్ యాక్ట్ చట్ట ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు , పోలీస్ శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు.అవసరమైన పాఠశాలకు విద్యా వాలంటీర్లను నియమిస్తామన్నారు. కొన్ని నెలల తర్వాత పాఠశాల హాజరు శాతాన్ని మళ్లీ పరిశీలిస్తామన్నారు. సమస్యలన్నీ అధిగమించి, విద్యా బోధనను పెంచి, ఉత్తీర్ణత శాతం మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. బాల్య వివాహాలు, విద్యా ఫలితాలు, పిల్లలను పాఠశాలకు తిరిగి చేర్చడం, ఆంగ్లం, స్మార్ట్ క్లాస్, హెల్త్, న్యూట్రిషన్, రేమిడియల్ సెంటర్స్, ట్రాన్స్ పోర్ట్ వంటి అంశాలపై స్వచ్ఛంద సంస్థలు, డీ.సీ.పీ.ఓ, పోలీస్ శాఖ, పాఠశాల ప్రిన్సిపాల్‌లు తమ కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, తహసీల్దార్ సరితరాణి, ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు, మండల స్పెషల్ అధికారి ప్రియాంక, జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, డీ.సీ.పీ.ఓ నర్సింహులు, ఎం.బీ ఫౌండేషన్, టీచ్ ఫర్ ది చెంజ్, భవిష్య భారతి,ఎన్.జీ.ఓలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నవ తెలంగాణ - అలంపూర్

అలంపూర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా అలంపూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు గట్టన్న మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, 22 నెలల పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ కావడం లేదని, ఈ ఏడాది కార్మికుల యూనిఫామ్ కు సంబంధించిన డబ్బులు, కార్మి కులకు ఇవ్వవలసిన సబ్బులు, కొబ్బరినూనె, బెల్లం ఇవ్వలేదని అన్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్మికులకు వేతనాలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. తక్షణం పెండింగ్ జీతాలు ఇవ్వాలని, 22 నెలల పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులు కార్మికుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు రాజేష్, స్థానిక నాయకులు లక్ష్మన్న, రాఘవేంద్ర, మునిస్వామి, ఏసేపు, రాము, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

నవతెలంగాణ - గట్టు

ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీ , ప్రమోషన్‌లలో భాగంగా జిల్లా పరిషత్ మాచర్ల పాఠశాల నుంచి జిల్లాలో వివిధ పాఠశాలలకు బదిలీ అయినా రవిప్రకాష్, కృష్ణ గౌడ్ రేణుక, చంద్రబాబు రాహుల్ ఉపాధ్యాయులు తాము సేవ చేసిన పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు రూ.24 000ల విలువ చేసే దాదాపు 400 ప్లేట్‌లను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరణ..

మండల కేంద్రంలోని రైతు వేదికలో పంట రుణమాఫీ వినతులలో భాగంగా రైతు రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రేషన్ కార్డు , పాస్ బుక్, ఆధార్ కార్డ్ తదితర కారణాలవల్ల రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని, ప్రతి గ్రామంలోని రైతు వేదిక దగ్గర దరఖాస్తులను ఏఓలకి అందించాలని ఏఈఓ హనుమంత్ రెడ్డి తెలిపారు.

అక్షరాస్యత ఉంటే అన్నింటిలో ముందంజ : ఎస్ఐ



నవతెలంగాణ - ధరూర్

అక్షరాస్యతలో ముందుంటేనే అన్నింట అభివృద్ధి చెందుతామని ఎస్సై శ్రీనివాస్ రావు అన్నారు. గురువారం, కలెక్టర్ బీ.ఎం సంతోష్ ఆదేశా లతో డీపీఆర్ఓ రఫీ యుద్దీన్ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కేటీదొడ్డి మండలం గువ్వల దిన్నే గ్రామంలో అక్షరాస్యత, బాల్యవివాహాల నిర్మూలన, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై కళాజాత కళాకారుల ఆధ్వర్యంలో ప్రజలకు పాట రూ పంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ఐ హాజరై మాట్లాడుతూ గ్రామా లలో బాల్యవివాహాలు అరికట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పిల్ల లను పనిలో పెట్టుకుంటే కేసులు తప్పవని హెచ్చరించారు. అలాగే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని , మద్యం తాగి వాహనం నడిపితే జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సూచనలు పాటించి అభివృద్ధికి సహకరిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పాల్గొన్నారు.

నీటి మునిగిన పంటల పరిశీలన



నవతెలంగాణ - గట్టు

బోయలగూడెం గ్రామంలోని ఇటీవలే 3 రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు నిటమునిగిన పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి భక్తవత్సలం గురువారం పరిశీలించారు. పత్తి , కంది , మిరప పంటలను పరిశీలించారు. పంట పొలాలలో నీరు ఆగిన చోట నీరు బయటకు పోయే విధంగా చేసుకోవాలని రైతులకు సూచించారు. పంట నష్టపోయిన రైతుల వివరాలను పై అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు.

ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని ధర్నా

నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. అంతకుముందు బీఆర్ఎస్ కార్యాలయం వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డా.కురువ విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 40 శాతం మంది రైతన్నలకు రుణమాఫీ కూడా అందలేదని, ప్రతిరైతుకు రుణమాఫీ చేయాలనీ డిమాండ్ చేశారు.ముఖ్య మంత్రి పూర్తి స్థాయిలో రుణమాఫీ పూర్తయిందని గారడి మాటలు చెప్తుంటే..మంత్రులు మనిషికో మాట చెబుతూ రైతన్నలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. అనేక ఆంక్షలు పెట్టి రైతన్నలను మోసం చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రుణం తీసుకున్న ప్రతి రైతుకురుణమాఫీ చేస్తామని ప్రకటించే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. అదేవిదంగా ఈ ప్రాంతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే గా గెలిచిన కృష్ణమోహన్ రెడ్డి వెంటనే పార్టీకి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నడిగడ్డలో 36 శాతం మంది కి మాత్రమే రుణ మాఫీ జరిగి ందని, మిగతా రైతులకు తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో పార్టీ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రా ములు, మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు, హనుమంతు నాయుడు,గుమ్మ గోవర్ధన్, రంగు మద్దిలేటి, బీచుపల్లి, అనం తపురం ఎంపీ టీసీ జయరాం రెడ్డి, టవర్ ముఖ్బుల్, మంద మల్లికార్జున్, అనంతపురం బీచు పల్లి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు , రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - గట్టు

రైతులందరూ 2 లక్షల రూపాయలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలం కేంద్రంలోని అంతరాష్ట్ర రహదారి పై మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల , హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎలాంటి ఆంక్షలు లేకుండా గద్వాల్ నియోజకవర్గ రైతులందరూ రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం,గట్టు మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహం పై అనుచిత వ్యాఖ్య లను నిరసిస్తూ తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాము, రాజు నాయుడు, బాసు గోపాల్, నల్ల గట్టు రాము, వెంకటేష్, వీరేష్, బాసు బొజ్జయ్య, రాజగోపాల్, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - అయిజ

అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో రుణమాఫీ అమలులో లోపాలను నిరసిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూరీ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాయ చూర్ చౌరస్తా సర్కిల్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందని అన్నారు. గత కొన్ని నెలల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ,రైతులకు రుణమాఫీ చేయాలని, రుణమాఫీ పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మరింతగా ఉద్యమం రెట్టింపు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో బీ.అర్.ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పటేల్ విష్ణు వర్ధన్‌రెడ్డి, మున్సిపాలిటీ చైర్మన్ చిన్న దేవన్న, సింగిల్ విండో అధ్యక్షుడు పీ, మధుసూదన్ రెడ్డి, మాజీ ఎం.ఈ.ఓ మేరమ్మ, బి అర్ ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ కురువపల్లయ్య, జి తేందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాతాళి, వీరేష్, అనిల్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

నవ తెలంగాణ- అలంపూర్


అలంపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రెండు లక్షల రుణమాఫీ ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సగం మంది రైతులకు కూడా రుణ మాఫీ చేయలేదని ఆరోపించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఎమ్మెల్యే విజయుడు మద్దతు తెలిపారు. అనంతరం తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



జోగులాంబ గద్వాల



గట్టులో..



అయిజలో..



అలంపూర్‌లో..